ప్రజలకు అభివాదం చేస్తున్న నారా లోకేష్, బుడ్డా రాజశేఖర్‌రెడ్డి

మతోన్మాదుల నుంచి

దేశాన్ని విముక్తి చేయాలి

- ఆవాజ్ జిల్లా కార్యదర్శి షేక్ సుభాన్, గౌరవ సలహాదారులు గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

మతోన్మాదుల నుండి దేశాన్ని విముక్తి చేయాలని ఆవాజ్ జిల్లా కమిటీ కార్యదర్శి షేక్ అబ్దుల్ సుభాన్, గౌరవ సలహాదారు డి.గౌస్ దేశాయ్ అన్నారు. శనివారం కార్మిక కర్షక భవన్‌లో ఎండి. ముస్తఫా అధ్యక్షతన అవాజ్ కర్నూలు జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో వారు మాట్లాడుతూ బిజెపి తన అధికారం కోసం దేశాన్ని దేశ ప్రజలను అల్లకొల్లోలానికి గురి చేస్తుందని, లేని దాన్ని ఉన్నట్టు జరగనిదాన్ని జరిగినట్లు అబద్దాపు ప్రచారాలతో మోసపు మాటలతో ప్రజల్లో అభద్రతా భావాన్ని పెంచుతుందన్నారు. కేరళలో జరగని సంఘటనను జరిగినట్టు ముగ్గురి కథను 32 వేల మంది ఆడపిల్లల కథగా దికేరళ ఫైల్స్ సినిమా ద్వారా మత ఉద్రిక్తతలను రెచ్చగొట్టి ప్రయోజనం పొందాలనుకున్నది కేంద్ర ప్రభుత్వం. తన గణాంకాలలో గుజరాత్ రాష్ట్రంలో ఈ ఐదు సంవత్సరాల కాలంలో 42 వేల మంది యువతులు, మహిళలు మాయమైపోయారని వారి ఆచూకీ తెలియదని అన్నారు. గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం వారి పట్ల తగిన శ్రద్ధ చూపలేదని ప్రకటించింది. మహిళల పట్ల ఏమాత్రం గౌరవం ఉన్నా బిజెపి నాయకులు గుజరాత్‌లో మాయమైన మహిళల గురించి ఎందుకు మాట్లాడడం లేదని వారు ప్రశ్నించారు. ఢిల్లీలో క్రీడాకారినిల పట్ల బిజెపి ఎంపీ తమను సెక్సువల్ గా హరాష్ చేశాడని, అతనిపై తగు చర్యలు తీసుకోవాలని, గత కొన్ని రోజులుగా దీక్షలు చేస్తుంటే బిజెపి నాయకులు , మహిళా నాయకురాళ్లు ఎందుకు స్పందించరన్నారు. జిల్లాలో రాబోయే కాలంలో అన్ని మండలాల్లో అవాజ్ కమిటీ పెట్టాలని, మతోన్మాద పార్టీలకు సహకరించే పార్టీలను దూరంగా ఉండాలని లౌకిక వాదులకే తమ తోడ్పాటును ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో డి.రెహమాన్, ఇక్బాల్ హుస్సేన్, మహమ్మద్ హుస్సేన్, రఫీ ,అహ్మద్ ఇసాక్, నాసిర్, ఇస్మాయిల్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న సుభాన్

దేవుడినీ వదలని చక్రపాణి రెడ్డి

- యువగళం సభలో నారా లోకేష్
- జనసంద్రమైన ఆత్మకూరు

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/ఆత్మకూరు

శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి దేవుడిని కూడా వదలడం లేదని, అందుకే ఆయన చీటింగ్ చక్రపాణి అని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర శనివారం ఆత్మకూరు మండలంలో సాగింది. కె.స్టార్ హోటల్ నుంచి ప్రారంభమైన పాదయాత్ర కరివేన, ఆత్మకూరు, బాపనంతాపురం మీదుగా నల్లకాల్వ వరకు సాగింది. ఆత్మకూరు పట్టణం జనంతో కిక్కిరిసిపోయింది. యువగళం పాదయాత్రలో లోకేష్‌ను చూసేందుకు భారీగా రోడ్లపైకి మహిళలు, యువత, వృద్ధులు భారీగా వచ్చారు. లోకేష్ అందరినీ ఆప్యాయంగా పలుకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆత్మకూరులో ఉన్న చిరు వ్యాపారులతో లోకేష్ మాట్లాడారు. వారు పడుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆత్మకూరు శివారులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ... ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి వర్ధన్ బ్యాంక్ ఏర్పాటు చేసి, మూడు నెలల్లో బోర్డు తిప్పేసి రూ.వంద కోట్లు మోసం చేశారన్నారు. తాము అధికారంలోకి రాగానే ఆ మొత్తాన్ని కక్కించి డిపాజిటర్లకు తిరిగి చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు 10 శాతం కట్టకుండా ఏ పనీ జరగడం లేదన్నారు. శ్రీశైలం బోర్డులో ఉద్యోగాలు, అవుట్ సోర్సింగ్ ఏజెన్సీ ద్వారా మాత్రమే చేస్తున్నారన్నారు. గుండాల వాగును ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేసి ప్లాట్లు వేసి అమ్మేశారన్నారు. అనంతరం పాదయాత్ర ఆత్మకూరు పట్టణం గుండా సాగింది. అడుగడుగునా జనం ఘన స్వాగతం పలికారు. కరివేన గ్రామస్తులు యువనేత లోకేష్‌ను కలిసి తాము ఎదుర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. తాగునీరు లేక ఇబ్బంది పడుతున్నామని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, డ్రెయినేజీలు, సిసి రోడ్లు లేవని తెలిపారు. పాదయాత్రలో మాజీ మంత్రులు భూమా అఖిల ప్రియ, ఎన్ఎండి.ఫరూక్, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, టిడిపి జిల్లా నంద్యాల అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ ఇన్‌ఛార్జీ బుడ్డా రాజశేఖర్ రెడ్డి, జిల్లా టిడిపి మహిళా విభాగం అధ్యక్షులు పార్వతమ్మ, నియోజకవర్గ ఇన్‌ఛార్జీలు బీసీ.జనార్ధన్ రెడ్డి, మాండ్ర శివానందరెడ్డి, ధర్మవరం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

'పది'లో 25వ స్థానం...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

పది పరీక్ష ఫలితాల్లో బాలుర కంటే బాలికలు ఎక్కువ ఉత్తీర్ణత శాతం సాధించారు. గతేడాది కంటే ఈ ఏడాది ఫలితాల ఉత్తీర్ణత శాతం రెండు శాతం పెరిగింది. జిల్లాలో మొత్తం ఉత్తీర్ణత శాతం 60.58 శాతంగా నమోదయింది. జిల్లాలో విద్యార్థులు గణితంలో వెనుకబడ్డారు. శనివారం పదో తరగతి పరీక్ష ఫలితాలను విద్యాశాఖ విడుదల చేసింది. కర్నూలు జిల్లాలో మొత్తం ఈ పరీక్షలకు 28,786 మంది విద్యార్థులు హాజరు కాగా 17,439 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు. ఇందులో బాలురు 8527 మంది, బాలికలు 8912 మంది ఉత్తీర్ణులు అయ్యారు. బాలికల ఉత్తీర్ణత శాతం 68.81 శాతంగా నమోదు కాగా బాలురలో 55.89 శాతంగా నమోదయింది. కర్నూలు జిల్లా పదో తరగతి పరీక్ష ఫలితాల్లో 25వ స్థానంలో నిలిచింది.

కొనసాగుతున్న యువగళం

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొనసాగుతోంది. తొలుత డోన్ నియోజకవర్గంలోకి ప్రవేశించిన యాత్ర పత్తికొండ, ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, పాణ్యం, కర్నూలు, నందికొట్కూరు నియోజకవర్గాల్లో ముగిసింది. ప్రస్తుతం శ్రీశైలం నియోజకవర్గంలో సాగుతోంది. అడుగడుగునా పలు వర్గాలు, గ్రామస్తులు, పలు సంఘాల ప్రతినిధులు లోకేష్‌ను కలిసి తమ సమస్యలను విన్నవిస్తున్నారు.

హైవే రోడ్డు బాధిత రైతుల ఆందోళన...

ఆరు లైన్ల రోడ్డు, హైవే రోడ్డు బాధిత రైతులతో కలిసి ఆర్‌డిఒ, తహశీల్దార్, కలెక్టర్‌కు వినతిపత్రాలు అందజేశారు. ఆరు లైన్ల రోడ్డు కోసం, బైపాస్ హైవే రోడ్డు కోసం భూములు ఇస్తున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆరు లైన్ల రోడ్డు కోసం, హైవే రోడ్డు కోసం కర్నూలు, కల్లూరు మండలాల్లో 12 గ్రామాల రైతుల నుంచి 300 ఎకరాలు, బి.తాండ్రపాడు నుంచి గార్గేయపురం వరకు ప్రభుత్వం సేకరిస్తోందని తెలిపారు. దీనికోసం రైతులకు చాలా అన్యాయమైన పరిహారం ఇస్తున్నారని విమర్శించారు. దిన్నెదేవరపాడు, నందనపల్లె, గార్గేయపురం భూములు రూ.3 కోట్ల విలువ చేసే భూములని, అక్కడి రైతులకు రూ.30 లక్షలు, నందనపల్లి గ్రామ రైతులకు రూ.8 లక్షలు మాత్రమే నష్టపరిహారం ఇస్తున్నారని తెలిపారు.



కర్నూలులో ఉద్రిక్తత...

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన పాదయాత్ర సందర్భంగా కర్నూలు నగరంలో ఉద్రిక్తత నెలకొంది. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ భూములు కబ్జా చేసినట్లు ముస్లిం, మైనారిటీలతో లోకేష్ ముఖాముఖి సందర్భంగా విమర్శించారు. సోమవారం కర్నూలులోని ఎస్‌టిబిసి కళాశాల మైదానంలోని విడిది కేంద్రం నుంచి పాదయాత్ర ప్రారంభమైంది. పాదయాత్ర ప్రారంభానికి ముందే ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. తనపై లోకేష్ చేసిన ఆరోపణలను నిరూపించాలని, ఎక్కడికి రావాలో చెప్పాలని, లేకుంటే తానే పాదయాత్ర వద్దకు వస్తానని సవాల్ చేశారు. లోకేష్ పాదయాత్ర కొనసాగుతుండగా నగరంలోని లాల్ మసీదు వైపు నుంచి ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ నడుచుకుంటూ పూల బజార్ వైపు పాదయాత్రకు ఎదురు వెళ్లే ప్రయత్నం చేయగా ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్‌ను పోలీసులు అరెస్టు చేసి పోలీసు స్టేషన్‌కు తరలించారు.

కర్ణాటక విజయంతో

కాంగ్రెస్ సంబరాలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాల పట్ల ప్రజల్లో వ్యతిరేకత ఉందని డిసిసి అధ్యక్షుడు సుధాకర్ బాబు పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయకేతనం ఎగరవేయడం పట్ల కర్నూలు డిసిసి కార్యాలయంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు సంబరాలు జరుపుకున్నారు. బాణాసంచా కాల్చి మిఠాయిలను పంచుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా డిసిసి అధ్యక్షుడు మాట్లాడుతూ కేంద్రంలో బిజెపి ప్రభుత్వాన్ని గద్దెదింపేందుకు అన్ని పార్టీలు ఐక్యం కావాలన్నారు. కర్ణాటకతో ప్రారంభమైన ఈఫలితాలు రాబోయే అన్ని ఎన్నికల్లో కొనసాగుతుందని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్‌యుఐ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు నాగ మధు, కాంగ్రెస్ నాయకులు సత్యనారాయణ గుప్తా, బతకన్నా, జాన్ విల్సన్ తదితరులు పాల్గొన్నారు.

మిఠాయిలు తినిపించుకుంటున్న నాయకులు

పురోగతి లేకుంటే చర్యలు తప్పవు

- ఉపాధికూలీలకు పని కల్పించాలి
- కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

ఇళ్ల నిర్మాణాలలో పురోగతి చూపించకపోతే చర్యలు తప్పవని మండల స్థాయి అధికారులను కలెక్టర్ డాక్టర్ జి.సృజన ఆదేశించారు. శనివారం ఎంపిడిఒలు, హౌసింగ్ ఇంజనీర్లతో ఇళ్ల నిర్మాణాల పురోగతి, ఉపాధిహామీ అమలుపై కలెక్టర్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఇళ్ళ నిర్మాణానికి సంబంధించి బేస్‌మెంట్ లెవెల్ వరకు కట్టుకుని ఆపేసి ఉన్నారని, అలాంటి వారిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులను ఆదేశించారు. తర్వాతి స్టేజ్‌కు వెళ్లకుండా అలా మధ్యలో వదిలేయకూడదని లబ్ధిదారులను మోటివేట్ చేయాలని కలెక్టర్ సూచించారు. స్పెషల్ ఆఫీసర్లు, ఎంపిడిఒలు, తహశీల్దార్లు, హౌసింగ్ ఎఇలు ఈ అంశంపై దృష్టి సారించాలని కలెక్టర్ సూచించారు. ఇంకా 16 వేల ఇళ్లు బిలో బేస్మెంట్ లెవెల్‌లోనే ఉన్నాయన్నారు. ఇకపై ప్రతి రోజు ఉదయం టెలికాన్ఫరెన్స్ ద్వారా సమీక్షిస్తామని అన్నారు. బిలో బేస్మెంట్ లెవెల్‌లో స్టేజ్ కన్వర్షన్ తప్పకుండా జరగాలన్నారు. 8న బిబిఎల్ స్టేజ్‌లో 16,429 ఉండగా, 12 నాటికి బిబిఎల్ స్టేజ్‌లో 16,186లుగా నమోదయ్యాని కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేస్తూ ఇదే విధంగా స్టేజ్ కన్వర్షన్ చేయాలని హౌసింగ్ సిబ్బందికి సూచించారు. స్టేజ్ కన్వర్షన్‌లో పురోగతి చూపించని మద్దికెర, అస్పరి, ఎమ్మిగనూరు (అర్బన్), గూడురు ఎఇలను ఎందుకు పురోగతి చూపలేదని కలెక్టర్ నిలదీశారు. పురోగతి చూపకపోతే చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ హెచ్చరించారు. స్పెషల్ ఆఫీసర్లు, ఎంపిడిఒలు, హౌసింగ్ ఎఇలు, తహశీల్దార్లు సమిష్టిగా కృషి చేస్తే పురోగతి సాధ్యమవుతుందన్నారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి నిర్దేశించిన లక్ష్యంలో నందవరం మండలం 25శాతం, హాలహర్వి మండలం 30 శాతం మాత్రమే పనులు కల్పించారని అసంతృప్తి వ్యక్తం చేశారు. ఎమ్మిగనూరు మండలంలో కూడా పనులు కల్పించడంలో వెనుక బడి ఉన్నారని తెలిపారు. కొన్ని మండలాల్లో 80 శాతం పనులు కల్పిస్తే ఈ మండలాల్లో ఎందుకు ఇంత తక్కువగా పనులు కల్పించారని సంబంధించిన మండలాల ఎంపిడిఒలను కలెక్టర్ నిలదీశారు. సరైన ప్రణాళిక రూపొందించుకొని వచ్చే వారానికి లేబర్ మొబిలైజేషన్ శాతాన్ని పెంచే దిశగా చర్యలు తీసుకోవాలని డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, ఎంపిడిఒలను కలెక్టర్ ఆదేశించారు.

మాట్లాడుతున్న ఎఆర్ డిఎస్‌పి ఇలియాజ్‌బాష

ఎఆర్ పోలీసులకు హెల్మెట్ పై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : జిల్లా ఎస్‌పి జి. కృష్ణకాంత్ ఆదేశాల మేరకు శనివారం ఎఆర్ డిఎస్‌పి ఇలియాజ్ బాషా ఆధ్వర్యంలో కర్నూలు ఆర్మడు రిజర్వుడు పోలీసులకు జిల్లా పోలీసు కార్యాలయంలో హెల్మెట్ పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎఆర్ డిఎస్‌పి ఇలియాజ్‌బాషా మాట్లాడారు. బైక్ నడిపే సమయంలో పోలీసులు హెల్మెట్‌లు ధరించి ఇత రులకు స్ఫూర్తిగా నిలవాలన్నారు. అతివేగంగా , మద్యం సేవించి, ఫోన్ మా ట్లాడుతూ వాహనాలు నడపకూడదని పలు జాగ్రత్తలు తీసుకోవాలని పోలీసు సిబ్బందికి సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తూ , సురక్షితంగా గమ్యా లను చేరుకోవాలన్నారు. ఇటీవల జరిగిన రోడ్డు ప్రమాదాలలో హెల్మెట్ లేకుండా బైక్ నడిపి వారు ప్రమాదాలకు గురైన విషయాన్ని గుర్తు చేశారు.ఆర్ ఐలు వి యస్ రమణ, పోతురాజు , శివారెడ్డి, ఎఆర్ ఎస్ఐలు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

16న కెవిఆర్‌లో ఉద్యోగం మేళా

ప్రజాశక్తి- కర్నూలు కలెక్టరేట్ : నైపుణ్యాభివృద్ధి , శిక్షణ శాఖ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారి ఆధ్వర్యంలో కెవిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఉద్యోగ మేళా నిర్వహిస్తున్నామని డిఆర్‌డిఎ పిడి వెంకటసుబ్బయ్య, జిల్లా ఉపాధి కల్పనాధికారి సోమశివారెడ్డి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. టెన్త్ ఆపై చదివిన అభ్యర్థులు ఈ జాబ్ మేళాలో పాల్గొని ఉద్యోగ అవకాశాలు పొందాలని వారు కోరారు.

సిబిఎస్ఇ ఫలితాల్లో రిడ్జ్ ప్రతిభ

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : సిబిఎస్ఇ ఫలితాల్లో రిడ్జ్ పాఠశాలకు చెందిన విద్యార్థులు ప్రతిభ ఘనపరిచినట్లు సిఇఒ గోపీనాథ్, ప్రిన్సిపల్ రాజేంద్రన్ శనివారం వెల్లడించారు. ఈ ఫలితాల్లో డి.హేమసాగరిక483, ఎం హర్షితా సాయి 480, ఎం సంహిత 477, మహితా సాయికుని 473, ఎం గౌతమ్ రెడ్డి 470, జగన్ 469 మార్కులను సాధించినట్లు వారు వెల్లడించారు. తమ పాఠశాలకు చెందిన విద్యార్థులు ఉత్తమ మార్కులను సాధించడం ప్రతి ఏటా ఆనవాయితీగా కొనసాగుతుందన్నారు. ఉత్తమ ఫలితాలు సాధనకు కృషిచేసిన ఉపాధ్యాయులను కూడా వారు అభినందించారు.

బిసిలను నట్టేట ముంచిన జగన్‌ను గద్దె దింపుదాం

నాగేశ్వరరావు యాదవ్ టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్

ప్రజాశక్తి- కర్నూలు హాస్పిటల్ : బిసిలను నట్టేట ముంచి బిసిల ద్రోహిగా నిలిచిన ముఖ్యమంత్రి వైఎస్.జగన్మోహన్ రెడ్డిని గద్దె దించుదామని బిబిసి సంక్షేమ సంఘం జాతీయ కన్వీనర్ టిడిపి బిసి సాధికార సమితి రాష్ట్ర కన్వీనర్ వై.నాగేశ్వరరావు యాదవ్ అన్నారు. బిసిలకు జరుగుతున్న అన్యాయం పై బిసిసెల్ ముఖ్య నాయకులు టిడిపి జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. వై.నాగేశ్వరరావుయాదవ్, రాష్ట్ర కార్యదర్శి పిజి. నర్సింహులుయాదవ్, బిసి సెల్ కర్నూలు పార్లమెంటు అధ్యక్షులు సత్రం రామకృష్ణుడు, బిసి సెల్ నాయకులురాజు యాదవ్, సుబాష్‌చంద్రబోస్, సంజీవలక్ష్మి, అమర్నాథ్‌గౌడ్, కె.వెంకటరాముడు, రాజ్యలక్ష్మి, మాట్లాడారు. రాష్ట్రంలో జగన్ రెడ్డి పాలనలో అత్యంత తీవ్రంగా నష్టపోయింది, దగాకు, అణచివేతకు గురైంది బీసీలే నని అన్నారు. ఈ ప్రభుత్వంలో అత్యంత కీలకమైన నామినేటెడ్ పదవుల్లో బిసిలు పనికిరారని చెప్పారన్నారు. అంటే ఎంత చులకనా భావంతో కనిపిస్తున్నారో అర్థమవుతుందన్నారు. యాదవులకు ఉమ్మడి రాష్ట్రంగా ఉన్నప్పుడు అప్పటి ఫైనాన్స్ మినిస్టర్ యనమల రామకృష్ణుడు అని తెలిపారు. ఇండస్ట్రియ లిస్టులు ఈ రాష్ట్రాన్ని బాగుపరుస్తూ ఉంటారు ఇండస్ట్రియల్ చైర్మన్ కష్ణయ్య యాదవ్ , కూడా చైర్మన్ నరసింహ యాదవ్ ఇలాంటి మంచి మంచి పదవులను బిసిలకు కట్టబెట్టడం టిడిపి హయాంలో జరిగిందన్నారు. ఈ వైఎస్ఆర్ పార్టీ ఏవైతే తెలుగుదేశం పార్టీలో బిసిలకు కట్టబెట్టిన పోస్టులను రెడ్డి సామాజిక వర్గానికి కట్టబెట్టిందన్నారు. అందుకే ఈ ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నిస్తున్నామని బిసిలను ఓటు బ్యాంకును వాడుకొని పాదయాత్రలో అనేక హామీలు ఇచ్చి బిసిలకు నామినేటెడ్ పదవులలో 34శాతం నుండి 24శాతం తగ్గించి అనేక నామినేటెడ్ పదవులను దూరం చేశారన్నారు. ఏవైతే రాజ్యాంగపరమైన 16,800 పోస్టులను బిసిలకు దక్కకుండా చేసింది జగన్‌రెడ్డి కాదా అని ప్రశ్నించారు. బిసి భవనాలు మొండి గోడలకు నిలబడిపోయాయని, బిసి సబ్ ప్లాన్స్ ఎక్కడ పోయాయో తెలియదని అన్నారు. ఇటువంటి పరిస్థితుల్లో వైసీపీ నాయకులకి బీసీలను ఓటు అడిగే హక్కే మీకు లేదన్నారు.

మాట్లాడుతున్న నాగేశ్వరరావు యాదవ్

యువత జాబ్ మేళాను వినియోగించుకోవాలి : హఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

నిరుద్యోగ యువత జాబ్ మేళాను వినియోగించుకోవాలని ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ అన్నారు. ఈ మేరకు శనివారం నగరంలోని రాయల్ ఫంక్షన్ హాలులో జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్‌ను ఆయన ఆంధ్రప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ (ఎ పి ఎ స్ ఎ స్ డి సి) అధికారులతో కలిసి ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... కర్నూలు రైల్వే స్టేషన్ సమీపంలో ఉన్న కెవిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో నైపుణ్యాభివృద్ధి , శిక్షణ శాఖ, ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం వారి ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతీ, యువకుల కొరకు జాబ్ మేళాను ఈనెల 16న నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ జాబ్ మేళాలో ప్రముఖ కంపెనీలు అయిన గ్రీన్‌టెక్, హెటిరో, ఎయిర్‌టెల్ పేమెంట్స్ బ్యాంక్, జియోమార్ట్, హీల్ మై ఫ్యామిలీ, ముత్తూట్ ఫైనాన్స్, బిఎమ్ఎస్ సెక్యూరిటీస్, వన్ పాయింట్ వన్ సొల్యూషన్‌తో పాటు వివిధ కంపెనీలలో ఉద్యోగాల కొరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తామని తెలిపారు. ఈజాబ్ మేళాకు హాజరయ్యే అభ్యర్థులు పదవ తరగతి, ఇంటర్,డిగ్రీ, పిజి, ఐటిఐ, డిప్లొమా, ఎంబిఎ, బి.టెక్ చదివిన వారు అర్హులుగా ఆయన పేర్కొన్నారు. ఈ జాబ్ మేళాకు హాజరయ్యే వారికి 18 యేళ్ల నుండి 40 సం.రాల లోపు వయస్సు కలిగిన వారై ఉండాలన్నారు. ఎంపికైన అభ్యర్థులందిరికి నెలకి రూ.10,000 నుండి రూ. 25,000 వరకు జీతం ఉంటుందని తెలిపారు. కర్నూలు నగరంలో జిల్లాలోఅర్హత కలిగిన నిరుద్యోగ యువతీ యువకులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగపరుచుకోవాలని అన్నారు. ఈ నెల 16న నేరుగా అభ్యర్థులు బయోడేటా, సర్టిఫికేట్‌లతో ఇంటర్వ్యూకు కెవిఆర్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో హాజరు కావాలని కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ తెలిపారు. అర్హత కలిగిన అభ్యర్థులు http:bit.ly/3pxO1iv లింక్ ద్వారా గానీ రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చున్నారు. మరిన్ని వివరాల కొరకు 8309283980, 6300009183 నంబర్లను సంప్రదించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా స్కిల్ డెవలప్మెంట్ మేనేజర్ శ్రీకాంత్ రెడ్డి, ప్లేస్మెంట్ సభ్యులు, సాయి తేజ, వారి సిబ్బంది పాల్గొన్నారు.



ప్రభుత్వ సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే కాటసానిరాంభూపాల్‌రెడ్డి

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : కాటసాని

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్

రాష్ట్రంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాలు అందిస్తున్నామని పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్ రెడ్డి అన్నారు. శనివారం పాణ్యం ఎమ్యెల్యే, టిటిడి ధర్మకర్తల మండలి సభ్యులు వైసిపి నంద్యాల జిల్లా అధ్యక్షులు కాటసాని రాంభూపాల్ రెడ్డి ఆధ్వర్యంలో కల్లూరు అర్బన్ 20వ వార్డ్ 53వ సచివాలయం, మారుతి మెగాసిటీలో గడప,గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఎమ్మెల్యే వార్డులోని ప్రతీ గడపకు వెళ్లి రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి చేస్తున్న జనరంజక పాలన, అవినీతి రహిత పాలన గురించి ప్రజలకు వివరిస్తూ జగనన్న ప్రభుత్వాన్ని దీవించాలని కోరారు. ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అర్హత కలిగిన ప్రతీ ఒక్కరికీ అందేలా చూడాలని సంబంధిత సచివాలయ సిబ్బందిని ఆదేశించారు. ఈకార్యక్రమంలో స్థానిక వార్డ్ కార్పొరేటర్ ఎ. నాగ లక్ష్మీరెడ్డి, కార్పొరేటర్ అండ్ స్టాండింగ్ కమిటీ మెంబర్లు వైజా.అరుణ, సాన శ్రీనివాసులు, కార్పొరేటర్లు దండు లక్ష్మీకాంత్ రెడ్డి, సంగాల సుదర్శన్ రెడ్డి, ఎరుకల వెంకటేశ్వర్లు, మిద్దె చిట్టెమ్మ, కల్లూరు సింగిల్ విండో ప్రెసిడెంట్ శివ శంకర రెడ్డి, కర్నూలు డిఎబి చైర్మన్ బెల్లం మహేశ్వర రెడ్డి, యువజన విభాగం రాష్ట్రప్రధాన కార్యదర్శి అక్కిమి హనుమంతు రెడ్డి, మైనారిటీ విభాగం నంద్యాల జిల్లా అధ్యక్షుడు యూనిస్‌బాష, నాయకులు వైజా.బాలచంద్ర రెడ్డి, బాబాన్న, సచివాలయ సిబ్బంది,వాలంటీర్లు పాల్గొన్నారు.

సిఎం జగనన్నను ఆశీర్వదించండి : సుధాకర్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్ : ముఖ్యమంత్రి వైఎస్.జగనన్నను ఆశీర్వదించాలని కోడుమూరు ఎమ్మెల్యే డాక్టర్ జరదొడ్డి సుధాకర్ అన్నారు. శనివారం కర్నూలు మండలం సూదిరెడ్డిపల్లి గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. గ్రామంలోని ఇంటింటికి తిరుగుతూ ప్రజల సమస్య లను అడిగి తెలుసు కున్నారు. పలువురు వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కల్తీ విత్తనాలను అరికట్టాలి

- రైతులకు అవసరమైన విత్తనాలు సరఫరా చేయాలి
- ఎంఆర్‌పి ధరకే విత్తనాలు, ఎరువులు విక్రయించాలి
- ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి రామకృష్ణ

ప్రజాశక్తి - దేవనకొండ

జిల్లా కల్తీ విత్తనాలను అరికట్టాలని, ఖరీఫ్ సీజన్‌లో రైతులకు విత్తనాలు ఎరువులు సకాలంలో అందించి ఆదుకోవాలని ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ డిమాండ్ చేశారు. శనివారం మండలంలోని తెర్నేకల్ గ్రామంలో రైతు సంఘం మండల కమిటీ శ్రీరాములు అధ్యక్షతన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రామకృష్ణ ముఖ్య అతిథులుగా హాజరై మాట్లాడారు. గతేడాది కొన్ని కంపెనీల పత్తి, మిరప విత్తనాలు పంట ఉత్పత్తిలో మెరుగుగా వచ్చినా, విత్తన కంపెనీలు ఈఏడాది అదును చూసుకుని ఎంఆర్‌పి ధరల కన్నా అధికంగా అమ్ముతున్నట్లు రైతులు ఆందోళన చెందుతున్నట్లు తెలిపారు. గతేడాది నకిలీ విత్తనాల వల్ల, తెగుళ్ల వల్ల దిగుబడి రాక రైతులు తీవ్రంగా నష్టపోయారని ఆందోళన వ్యక్తం చేశారు. వ్యవసాయ శాఖాధికారులు ముందు జాగ్రత్తగా తనిఖీలు చేయడం, రైతులను మేల్కొల్పడం వంటి చర్యలు చేపట్టాలని కోరారు. రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి ప్రభుత్వం రైతు భరోసా కేంద్రాల్లో నాణ్యమైన ఎరువులు, విత్తనాలు అందుబాటులో ఉంచుతామని చెప్పి సరఫరా చేయడం లేదన్నారు. విత్తనం మొదలుకొని తిరిగి పంట కొనుగోలు చేసే వరకు తమదే బాధ్యత అని చెప్పిన ప్రభుత్వం మాట తప్పిందని విమర్శించారు. రైతులను అన్యాయానికి గురి చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రైతులందరికీ పరిమితులు లేకుండా సరిపోయి నన్నీ విత్తనాలు, ఎరువులు సబ్సిడీలో అందజేయాలని కోరారు. రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సూరి, నాయకులు కృష్ణారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

మొదటి విడత కింద 37,652 పాఠ్య పుస్తకాలు

- ఎంఇఒ సువర్ణ లత సునీయం

ప్రజాశక్తి - పెద్దకడుబూరు

మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్, కస్తూరిబా గాంధీ, బాలికల గురుకుల విద్యాలయాల్లో చదువుతున్న విద్యార్థులకు 2023-24 విద్యా సంవత్సరానికి మొదటి విడత కింద 37,652 పాఠ్య పుస్తకాలు ఎంఆర్‌సికి వచ్చినట్లు ఎంఇఒ సువర్ణ లత సునీయం శనివారం తెలిపారు. మండలంలోని 1 నుంచి 10వ తరగతి చదువుతున్న 10,825 విద్యార్థులకు 75,432 పాఠ్యపుస్తకాలు అవసరమవుతున్నాయని తెలిపారు. ఇందులో ఇప్పటివరకు 37,652 పాఠ్య పుస్తకాలు వచ్చాయన్నారు. మిగిలిన పాఠ్య పుస్తకాలు రావాల్సి ఉందని తెలిపారు.

క్రికెట్ బెట్టింగ్ ముఠా అరెస్టు

- భారీగా నగదు సీజ్

ప్రజాశక్తి-ఆదోని

పట్టణంలోని పింజరివాడిలో ఐపిఎల్ బెట్టింగ్ నిర్వహిస్తున్న ముఠా గుట్టు రట్టు చేసి మూడో పట్టణ పోలీసులు నలుగురిని అరెస్టు చేశారు. శనివారం నగదు, సెల్ ఫోన్లు, బైకులు మీడియా ముందు ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డీఎస్పీ శివ నారాయణ స్వామి మాట్లాడారు. ఎస్పీ కృష్ణకాంత్ ఆదేశాల మేరకు సిఐ శ్రీరామ్ సిబ్బందితో దాడులు నిర్వహంచారని తెలిపారు. బెట్టింగ్ నిర్వాహకులు బోయ మహానంది, పింజరి హుస్సేని, పింజరి మహ్మద్ ఖాసీం, వడ్ల రాఘవేంద్ర నుంచి సుమారు రూ.80 లక్షల నగదు, సెల్ ఫోన్లు, రెండు మోటార్ సైకిళ్లు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. పరారీలో ఉన్న బోయ రమేష్, ఇస్మాయల్, గొల్ల భీమ, ప్రతాప్, శ్రీనివాసులు, గౌడవలీ నిందితులను పట్టుకునేందుకు ప్రత్యేక బృందం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. దాడుల్లో సిఐ శ్రీరామ్, ఎస్ఐలు ఆర్.జయ శేఖర్, బి.చిన్న పీరయ్య, పోలీసు సిబ్బంది నరేంద్ర, సోమేష్, ఖాసీం వలీ, నరసింహా, మంజు కుమార్, మురళీని ప్రత్యేకంగా అభినందించారు. అసాంఘిక కార్యకలాపాల పట్ల ప్రత్యేక నిఘా ఉంచుతామన్నారు. అలాంటి వారి సమాచారం తమకు ఇస్తే కట్టడికి సహకరించిన వారవుతారని తెలిపారు.

నగదు, నిందితులను చూపుతున్న డీఎస్పీ

కర్ణాటక ఫలితాలు బిజెపికి గుణపాఠం...

- ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్న పాలక ప్రభుత్వాలు
- ఉపాధి చట్టాన్ని కాపాడుకుందాం - వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి - దేవనకొండ

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ఫలితాలు ప్రజా వ్యతిరేక బిజెపి ప్రభుత్వానికి గుణపాఠం లాంటివని, పెద్దలకు కొమ్ము కాసి, పేదలకు అన్యాయం చేస్తూ, మతం ముసుగులో రాజకీయాలు చేసిన బిజెపికి కర్ణాటక ప్రజలు తగిన గుణపాఠం చెప్పారని వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం దేవనకొండలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, జిల్లా కార్యదర్శి కెవి.నారాయణ, జిల్లా అధ్యక్షులు వీరశేఖర్ మాట్లాడారు. వ్యవసాయ కార్మికులు వలసలు వెళ్లకుండా గ్రామాల్లోనే పనులు కల్పిస్తూ ఎంతో ఆసరాగా ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వీర్యం చేస్తున్నాయని విమర్శించారు. ప్రజా వ్యతిరేకి బిజెపికి కర్ణాటక ప్రజలకు తగిన గుణపాఠం చెప్పారని పేర్కొన్నారు. బిజెపి ప్రభుత్వం ఇప్పటికే దేశంలో ప్రజలకు వ్యతిరేకంగా అనేక నిర్ణయాలు తీసుకుందని తెలిపారు. ఇందులో భాగంగా కేంద్ర ప్రభుత్వం 32 కోట్ల పని దినాలను కల్పిస్తామని చెప్పి 15 కోట్లకు తగ్గించడం దారుణమన్నారు. గతంలో ఉపాధి పనుల వద్ద కూలీలకు మౌలిక వసతులు కల్పించేవారని, ప్రస్తుత పాలక ప్రభుత్వాలు వాటిని విస్మరించాయని విమర్శించారు. దేశంలో రెండోసారి అధికారంలోకి వచ్చిన బిజెపి ప్రభుత్వం రైతుల ఎరువుల సబ్సిడీలో కోత విధించిందని తెలిపారు. కేంద్ర బడ్జెట్ రూ.46 లక్షల కోట్లు ప్రవేశపెడితే అందులో పేదలకు కేవలం 10 శాతం, సంపన్న వర్గాలకు 45 శాతం కేటాయించడం దారుణమన్నారు. కూలీలకు కొలతల ప్రకారం వేతనాలు ఇవ్వాలని, రెండు పూటలా హాజరు శాతం ప్రకారం చెల్లిస్తామనడం సబబు కాదని తెలిపారు. ఆన్‌లైన్ మస్టర్ వల్ల సాంకేతిక లోపాలతో కూలీలు పలు అవస్థలు ఎదుర్కొంటున్నారని పేర్కొన్నారు. రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం సంక్షేమ పథకాలకు బటన్ నొక్కి నిధులు చెల్లిస్తూ కూలీలకు వచ్చిన ఉపాధి నిధులను కాంట్రాక్టర్లకు కట్టబెడుతూ యంత్రాలతో పనులు చేస్తూ ఉపాధి చట్టానికి తూర్పు పొడుస్తోందని విమర్శించారు. పశ్చిమ రాయలసీమ ప్రాంత రైతుల సాగునీటి ప్రాజెక్టు హంద్రీనీవాకు బడ్జెట్‌లో నిధులు కేటాయించ లేదన్నారు. కర్ణాటకలో బిజెపి ప్రభుత్వం ఓటమి చెందడం శుభ పరిణామమని తెలిపారు. ఉపాధి హామీ చట్టం పట్ల బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న దుర్మార్గానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఈనెల 22న అన్ని జిల్లా కలెక్టరేట్ల ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పార్టీలకతీతంగా పెద్ద ఎత్తున ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బాలకృష్ణ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు

జలసంద్రమైన అంగన్వాడీ కేంద్రం

- వర్షపు నీటితో పాటు డ్రెయినేజీ నీరు చేరిక....
- అవస్థల్లో చిన్నారులు, గర్భిణులు

ప్రజాశక్తి-ఆలూరు

తాగేందుకు నీరు లేని వేసవిలో ఏకంగా నీటిలో అంగన్వాడీ కేంద్రం మునిగిన సంఘటన శనివారం గ్రామస్తుల కంటపడింది. ఆలూరు మండలం మనేకుర్తి గ్రామంలో ఎంపిపి పాఠశాల ఆవరణలో ఉన్న అంగన్వాడీ కేంద్రం నీటిలో తేలాడుతూ కనిపించింది. పాఠశాలలోని సంపు పైప్ పగిలి అంగన్వాడీ కేంద్రంలో రెండు అడుగుల నీరు చేరి పాల ప్యాకెట్లు, సామగ్రి గది నిండా తేలాడాయి. పాఠశాలలోని వర్షపు నీరు బయటికి వెళ్లేందుకు దారి లేకపోవడమే కాకుండా గ్రామంలోని డ్రెయినేజీ కూడా పాఠశాలలో చేరుతున్నాయి. డ్రెయినేజీ, చీడపురుగులతో చిన్నారులు అనారోగ్యం పాలవుతారని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. గతంలో పాఠశాల పక్కనే డ్రెయినేజీ ఉండగా జాతీయ రహదారి విస్తరణలో మూసివేశారు. తాత్కాలికంగా డ్రెయినేజీని ఏర్పాటు చేస్తామని ఎస్ఆర్‌కె కన్‌స్ట్రక్షన్ యాజమాన్యం మరిచింది. సర్పంచి, సచివాలయ అధికారులు మాత్రం సమస్య తమది కాదన్నట్లు మొహం చాటేస్తున్నారని గ్రామస్తులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పాఠశాల, అంగన్వాడీ, గ్రామస్తుల ప్రధాన సమస్యను సంబంధిత అధికారులు పరిష్కరించాలని కోరారు.

అంగన్వాడీ కేంద్రంలోకి చేరిన నీరు

లోక్ అదాలత్‌లో రాజీ మార్గం

- న్యాయమూర్తి రమణా రెడ్డి

ఆలూరు : వాది, ప్రతివాదులు లోక్ అదాలత్‌లో రాజీ మార్గమే పరిష్కారమని ఆలూరు జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి రమణారెడ్డి తెలిపారు. శనివారం ఆలూరు నియోజకవర్గంలోని ఆయా పోలీసు స్టేషన్ల పరిధిలో వివిధ కేసుల్లో నమోదయిన వాది, ప్రతివాదులను లోక్ అదాలత్ సందర్భంగా 141 కేసులను న్యాయమూర్తి రమణారెడ్డి పరిష్కరించారు. బార్ అసోసియేషన్ అధ్యక్షులు లక్ష్మీ కాంత్, కార్యదర్శి విజయభాస్కర్, న్యాయవాదులు రవి, ప్రవీణ్, వీరేష్, రంగప్ప, షేక్షావలీ, రవి ప్రసాద్, షాకీర్, చాంద్ పాల్గొన్నారు.

సామాజిక బాధ్యతలను నెరవేర్చడంలో

యుటిఎఫ్ ముందంజ

- యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు సురేష్‌కుమార్

ప్రజాశక్తి - గోనెగండ్ల

సామాజిక స్పృహ కలిగిన ఉపాధ్యాయ సంఘంగా మెరుగైన సమాజం కోసం పాటుపడుతూ సామాజిక బాధ్యతలను నెరవేర్చడంలో యుటిఎఫ్ ముందుంటుందని యుటిఎఫ్ రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ తెలిపారు. యుటిఎఫ్ గోనెగండ్ల మండల అధ్యక్షులు రామన్ ఆధ్వర్యంలో పేద, బడుగు, బలహీన వర్గాలకు చెందిన విద్యార్థులు ఆంగ్లం, గణితంలో ఉన్నతంగా రాణించాలని గోనెగండ్ల బస్టాండ్ పాఠశాలలో ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్, గణిత తరగతులను శనివారం ప్రారంభించారు. ముఖ్య అతిథులుగా సురేష్ కుమార్, యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జె.ఎల్లప్ప, జయరాజు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. సామాజిక స్పృహలో భాగంగా గోనెగండ్ల మండలంలోని విద్యార్థులు ఇంగ్లీష్, గణిత భాషల్లో మెళకువలు నేర్చుకుని మంచి పట్టు సాధించి వారి భవిష్యత్తుకు మంచి పునాది వేసుకోవడానికి ఈ శిక్షణ తరగతులు చాలా చక్కగా ఉపయోగపడతాయని తెలిపారు. వేసవి సెలవుల్లో పదేళ్లుగా ఉపాధ్యాయ వృత్తిలో అనుభవం ఉన్న ఉపాధ్యాయుల చేత బోధింప పడుతున్న ఈ శిక్షణ తరగతులను అందరూ సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ శిక్షణ తరగతులకు 60మంది పైగా రిజిస్టర్ చేసుకున్నారని తెలిపారు. మిగిలిన విద్యార్థులు కూడా ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి నరసింహులు, నాయకులు శంకర్ నాయక్, రాముడు, నాగేశ్వరరావు, జిక్రియా, గుమ్మల బాబు, హుస్సేన్, లింగన్న, నాగరాజు, ఖలీల్, ఎస్ఎఫ్ఐ నాయకులు వీరన్న, ఖాజా, నంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సురేష్ కుమార్

యువగళానికి మద్దతుగా 15న టిడిపి పాదయాత్ర

ప్రజాశక్తి - ఆదోని

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు మద్దతుగా ఆదోనిలో పాదయాత్ర నిర్వహిస్తామని టిడిపి నియోజవర్గ ఇన్‌ఛార్జీ, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తెలిపారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. యువగళం పాదయాత్ర 15వ తేదీ నాటికి 100 రోజులు పూర్తి చేసుకుంటుందని తెలిపారు. ఈ సందర్భంగా యువగళం పాదయాత్రకు సంఘీభావంగా పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు చెప్పారు. తన నివాసం వద్దకు నాయకులు, కార్యకర్తలు 15న ఉదయం 7.30 గంటలకు చేరుకోవాలని కోరారు. ఎన్‌టిఆర్ విగ్రహం మీదుగా శ్రీనివాస భవన్ వరకు ఈ పాదయాత్ర జరుగుతుందన్నారు. ఆదోని నియోజవర్గంలోని ప్రతి గ్రామ, పట్టణ టిడిపి నాయకులు, కార్యకర్తలు, నందమూరి అభిమానులు, యువకులు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఎమ్మిగనూరులో యువగళం పాదయాత్రకు మద్దతుగా యాత్ర నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పట్టనంలోని అనంత పద్మనాభ స్వామి దేవాలయం నుంచి కమిటీ సర్కిల్, శ్రీనివాస టాకీస్ సర్కిల్, ట్యాంక్ బండ్ రోడ్, సోమప్ప సర్కిల్, స్టేట్ బ్యాంక్ సర్కిల్, పెద్ద పార్క్ మీదుగా రావూస్ డిగ్రీ కళాశాల, శివ సర్కిల్, ఎద్దుల మార్కెట్, గోనెగండ్ల సర్కిల్, బాట మారెమ్మ గుడి వరకు పాదయాత్ర నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

మంత్రాలయం : రాష్ట్రంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకునేందుకు టిడిపి జాతీయ ప్రదాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు వంద రోజులు పూర్తి కావడంతో మద్దతుగా టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర చేపడుతున్నట్లు టిడిపి మండల అధ్యక్షులు పన్నగ వెంకటేష్ స్వామి తెలిపారు. ఈనెల 15 నాటికి యువగళం పాదయాత్ర వంద రోజులు అవుతోందని పేర్కొన్నారు. 15న సోమవారం మండలంలోని చిలుకలడోన గ్రామం నుంచి మంత్రాలయం వరకు తిక్కారెడ్డి ఆధ్వర్యంలో పాదయాత్ర చేపడుతున్నట్లు చెప్పారు. ఉదయం 7 గంటలకు పాదయాత్ర ప్రారంభం కానుందని, మంత్రాలయం నియోజకవర్గంలోని నాలుగు మండలాలు, అన్ని గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

ఇదెక్కడి 'జగనన్నకు చెబుదాం'

- టిడిపి క్లస్టర్ ఇన్‌ఛార్జీ దేశాయి

ప్రజాశక్తి - నందవరం

ప్రజా సమస్యలు పరిష్కరిస్తామని ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ప్రవేశపెట్టిన 'జగనన్నకు చెబుదాం' మాత్రం సమస్యలను పరిష్కరించే స్థితిలో లేదని తేలిపోయిందని టిడిపి ఎమ్మిగనూర్ క్లస్టర్ ఇన్‌ఛార్జీ, మార్కెట్ యార్డ్ మాజీ ఛైర్మన్ మాధవరావు దేశాయి విమర్శించారు. శనివారం అయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉన్న సమస్యలను పరిష్కరించాలని ముఖ్యమంత్రికి నేరుగానే చెబితేనే పరిష్కారం కావడం లేదని, అలాంటిది 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమం ప్రచారానికి మాత్రమే ప్రారంభించారని విమర్శించారు. ప్రజలు 1902కు కాల్ చేస్తే వైసిపి ప్రతినిధులు అందుబాటులో లేరని మెసేజ్‌లు పంపుతున్నారని తెలిపారు. ఆ నెంబర్‌కు ఒకే సమాధానం సరిపోతుందని, అది '1' అంటే ఒక్కఛాన్స్‌తో, 9 అంటే నవరత్నాలతో ఆర్థిక పరిస్థితిని కుదేలు చేసి, '0' అంటే అభివృద్ధిలో ఉన్న ఎపిని సున్నా స్థానంలో నిలబెట్టి, '2' అంటే రెండోసారి ఛాన్స్ ఇస్తారా లేదా అని మీ ఇష్టం అనే విధంగా ఆ కాల్ సెంటర్ నెంబర్‌ను ఏర్పాటు చేసారని ఎద్దేవా చేశారు. అలాగే మండలంలో దాదాపు 70 నుంచి 80 ఓసీ, మైనార్టీ డ్వాక్రా సంఘాల గ్రూపులకు ఆసరా డబ్బులు ఇంకా పడలేదని తెలిపారు. రికార్డుల్లో మాత్రం డబ్బులు అందినట్లు చూపించి, డ్వాక్రా సంఘాల మహిళలను ముఖ్యమంత్రి జగన్ మోసం చేస్తున్నారన్నారు. మహిళలు, ప్రజలను మోసం చేసినట్లే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డిని కూడా రాబోయే ఎన్నికల్లో ప్రజలు చిత్తు చిత్తుగా ఓడించి ఇంటికి పంపుతారన్నారు.

అంబరాన్నంటిన కాంగ్రెస్ సంబరాలు

సంబరాలు జరుపుకుంటున్న కాంగ్రెస్ నాయకులు

ఎమ్మిగనూరులో విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్న

ప్రజాశక్తి - ఆదోని

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించడంతో పట్టణంలోని పాత బస్టాండ్, శ్రీనివాస్ భవన్ కూడలిలో భారీ ఎత్తున బాణసంచా పేల్చి విజయోత్సవ సంబరాలు జరుపుకున్నారు. నియోజకవర్గ ఇన్‌ఛార్జీ దేవిశెట్టి ప్రకాష్, జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు ఎమ్‌డి.నూర్, నీలకంఠప్ప, దిలీప్ దొక ఆధ్వర్యంలో కూడా సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కర్ణాటకలో గత బిజెపి ప్రభుత్వ పాలనతో విసిగిపోయిన ప్రజలు అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి పూర్తిస్థాయిలో మెజారిటీ ఇచ్చారని తెలిపారు. మైనార్టీ సెల్ ఆదోని ఛైర్మన్ ఎమ్‌డి.రఫీ, ఉపాధ్యక్షులు హుస్సేన్ బాష, జిల్లా ఐఎన్‌టియుసి ఉపాధ్యక్షులు జయరాం, యూత్ కాంగ్రెస్ బి.తాయన్న, మండల అధ్యక్షులు బి.హనుమంతు, సీనియర్ నాయకులు శ్రీధర్, దొడ్డంకేరి లక్ష్మన్న, గోపాల్ రెడ్డి పాల్గొన్నారు.

ఎమ్మిగనూరు : కాంగ్రెస్‌తోనే దేశాభివృద్ధి సాధ్యమని, కర్ణాటక ఎన్నికల్లో 130 సీట్లతో ప్రభంజనం సృష్టించిన కాంగ్రెస్ పార్టీ వైపు దేశ ప్రజలు చూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ ఇన్‌ఛార్జీ కె.లక్ష్మీనారాయణ రెడ్డి, డిసిసి ప్రధాన కార్యదర్శి కాసీం వలీ, ఎన్ఎస్‌యుఐ జిల్లా అధ్యక్షులు వీరేష్ యాదవ్ తెలిపారు. సోమప్ప సర్కిల్‌లో బాణసంచా కాల్చి, మిఠాయిలు పంచుకొని సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కేంద్రంలో ఉన్న బిజెపి ప్రభుత్వం దేశ ప్రజల మధ్య చిచ్చు పెడుతోందని విమర్శించారు. రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడోయాత్ర కర్ణాటక కాంగ్రెస్ విజయానికి నాంది అని తెలిపారు. అవినీతి పాలనలో బిజెపి ప్రభుత్వం కూరుకుపోయిందని విమర్శించారు. రైతులు, యువత, నిరుద్యోగులు, విద్యార్థుల సమస్యలు తీరాలంటే కేంద్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావాలని తెలిపారు. చీరాల దొడ్డి ఖాజా, తాయప్ప, మురళీ, కామయ్య, బందే నవాజ్, చాంద్ బాషా పాల్గొన్నారు. **పెద్దకడబూరు** మండలం కల్లుకుంట గ్రామం బస్టాండ్ ఆవరణలో కాంగ్రెస్ సీనియర్ నేత, జిల్లా ప్రధాన కార్యదర్శి కురువ మల్లేష్, మండల కార్యదర్శి కె.యాదగిరి, చాంద్ పీరా, బడే సాబ్‌లు బాణసంచా కాలుస్తూ సంబరాలు జరుపుకున్నారు. ఈరన్న, మల్లేష్, ముని, సుందరేష్ పాల్గొన్నారు.

దేవనకొండ : కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ బిజెపిపై 136 స్థానాల్లో విజయఢంకా మోగించడంతో కాంగ్రెస్ నాయకులు స్థానిక అయ్యప్ప స్వామి దేవాలయ ప్రధాన రహదారిపై బాణసంచా పేల్చి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ నాయకులు మిరపకాయల శ్రీనివాసులు, కోడిగుడ్ల దస్తగిరి, పి.కాసీం సాబ్, టైలర్ వెంకీ ఆధ్వర్యంలో సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ గెలుపు దేశానికి మలుపు అవుతుందని అన్నారు. త్వరలో జరగబోయే వివిధ రాష్ట్రాల ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ సత్తా చాటుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

చిప్పగిరి : కాంగ్రెస్ పార్టీతోనే బలహీన వర్గాలకు న్యాయం జరుగుతుందని, దేశానికి కాబోయే ప్రధాని రాహుల్ గాంధీనేనని కాంగ్రెస్ పార్టీ ఆలూరు నియోజకవర్గ సీనియర్ నాయకులు, జిల్లా ప్రధాన కార్యదర్శి చిప్పగిరి లక్ష్మినారాయణ తెలిపారు. కర్ణాటకలో కాంగ్రెస్ గెలుపొందిన సందర్భంగా శనివారం చిప్పగిరిలోని అంబేద్కర్ సర్కిల్‌లో బాణసంచా పేలుస్తూ, మిఠాయిలు పంచుతూ సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ 136 సీట్లతో గెలుపొందడం చాలా సంతోషంగా ఉందని తెలిపారు. బిజెపి పాలనపై ప్రజలు విసిగిపోయారని, కర్ణాటకలో ఎప్పుడెప్పుడు ఎన్నికలు వస్తాయా అని ప్రజలు ఎదురు చూశారని చెప్పారు. ఓటుతో గట్టిగా బుద్ధి చెప్పారన్నారు. కాంగ్రెస్ మండల అధ్యక్షులు దేగులపాడు మంజునాథ్, బండమీద గోవిందు, నాయకులు కరెంట్ గోవిందు, బాలరాజు, చిప్పగిరి వినోద్ కుమార్, శ్రీధర్, పాపన్న, బోయ కోనకోండ్ల సుంకన్న, జాన్, శివ పాల్గొన్నారు.

దేవనకొండలో బాణసంచా కాలుస్తున్న కాంగ్రెస్ నాయకులు

చిప్పగిరిలో సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

పెద్దకడబూరులో సంబరాలు జరుపుకుంటున్న నాయకులు

కన్నడ ప్రజల తీర్పు బిజెపికి చెంపపెట్టు

- జైభీమ్ ఎంఆర్‌పిఎస్

ప్రజాశక్తి - మంత్రాలయం

సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

కర్ణాటక రాష్ట్రంలో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కన్నడ ప్రజలు ఇచ్చిన తీర్పు బిజెపికి చెంప పెట్టు లాంటిదని జైభీమ్ ఎంఆర్‌పిఎస్ వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు చిక్కం జానయ్య మాదిగ విమర్శించారు. శనివారం జిల్లా కన్వీనర్ గందాలం మణికుమార్ మాదిగ ఆధ్వర్యంలో స్థానిక ప్రయివేట్ లాడ్జిలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కర్ణాటక ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 136 సీట్లు సాధించి అధికారం చేపట్టేందుకు సిద్ధంగా ఉందని తెలిపారు. మతతత్వ పార్టీగా గుర్తింపు పొందిన బిజెపికి 64 సీట్లు, జెడిఎస్ పార్టీ 20 సీట్లు, ఇతరులకు 4 సీట్లు వచ్చాయని పేర్కొన్నారు. కర్ణాటక ఎన్నికల్లో మందకృష్ణ మాదిగ బిజెపి తరపున ప్రచారం చేయడం సిగ్గుచేటన్నారు. బిజెపి మతతత్వ పార్టీ అని, ఎస్సీ వర్గీకరణను వంద రోజుల్లో చేస్తానని మోసం చేసిన పార్టీ అని తెలిపారు. అలాంటి పార్టీకి మందకృష్ణ మాదిగ మద్దతునిచ్చి మళ్లీ మాదిగలను మోసం చేశారని దుయ్యబట్టారు. అంబేద్కర్ రచించిన అతి పెద్ద గ్రంథం భారత రాజ్యాంగమని, ప్రపంచానికి ఆదర్శమని తెలిపారు. భారత రాజ్యాంగం ద్వారా నడిచే ప్రజాస్వామ్యాన్ని కూల్చాలని బిజెపి ప్రభుత్వం చూస్తోందని విమర్శించారు. బిజెపికి కర్ణాటక ఓటర్లు తగిన బుద్ధి చెప్పడం హర్షనీయమన్నారు. జాతిని బిజెపి మతతత్వ పార్టీకి తాకట్టు పెట్టిన మందకృష్ణ మాదిగ ఆటలు ఆంధ్రప్రదేశ్‌లో సాగనివ్వబోమని తెలిపారు. రాష్ట్రంలో మాదిగలకు ఎస్సీ వర్గీకరణ చేపట్టకపోతే కర్ణాటక ఓటర్లలాగే రాష్ట్ర ఓటర్లు కూడా వైసిపికి తగిన బుద్ధి చెబుతారని హెచ్చరించారు. జై భీమ్ ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కోఆర్డినేటర్ రంగస్వామి, మంత్రాలయం మండల అధ్యక్షులు నరసింహులు, ఎమ్మిగనూరు మండల అధ్యక్షులు పెద్ద ముష్టి అబ్రహాం పాల్గొన్నారు.

ట్రాక్టర్ బోల్తా - తప్పిన పెను ప్రమాదం

ప్రజాశక్తి - పెద్దకడబూరు

మండలంలోని కంబాలదిన్నె గ్రామం సమీపంలో ట్రాక్టర్ బోల్తా పడింది. శనివారం రచ్చుమర్రి గ్రామానికి చెందిన ట్రాక్టర్ డ్రైవర్ నాగేంద్ర, రమేష్, తిమ్మప్ప, సోమప్ప, ఆంజనేయులు పశుగ్రాసం కోసం బనవాసి గ్రామానికి చేరుకున్నారు. బనవాసి గ్రామం నుంచి డ్రాక్టర్‌లో పశుగ్రాసం లోడు చేసుకుని తమ సొంత గ్రామానికి బయల్దేరారు. కంబాలదిన్నె గ్రామ ప్రధాన రహదారి గుంతలమయంగా ఉండడంతో ఒక్కసారి వరిగడ్డి ట్రాక్టర్ బోల్తా పడింది. డ్రైవర్ నాగేంద్ర అప్రమత్తంగా ఉండడంతో పైన కూర్చున్న నలుగురు కిందికి దూకడంతో ఊపిరి పీల్చుకున్నారు. ఎవరికీ ప్రాణ నష్టం కలుగలేదు. ప్రధాన రహదారిలో ప్రయాణికులకు గంటల తరబడి అంతరాయం ఏర్పడింది.

బోల్తా పడిన ట్రాక్టర్

భారత్ నిజాయితీ పాలన కోరుకుంటోంది

- మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు రంగయ్య

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

భారతదేశం నిజాయితీ గల పాలన కోరుకుంటోందని మాలమహానాడు రాయలసీమ అధ్యక్షులు సి.రంగయ్య తెలిపారు. ఎఐసిసి అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన మొదటి లక్ష్యంలోనే జయకేతనం ఎగురవేసిన మల్లికార్జున ఖర్గేకు శుభాకాంక్షలు తెలిపారు. కర్ణాటక ఎన్నికల ఫలితాల పట్ల శనివారం ఆయన హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ మంచి ఆలోచనతో దళితుని ఎఐసిసి అధ్యక్షులుగా ప్రకటించిన క్షణమే జయకేతనం ఎగురవేసిందని తెలిపారు. ముఖ్యమంత్రిగా పదవిలో ఉండి రాష్ట్రానికి సేవ చేసి సొంతిళ్లు కూడా లేని నిజాయితీ పాలన చేసిన దామోదరం సంజీవయ్య సేవలను దృష్టిలో పెట్టుకుని దళితునికి ఎఐసిసి అధ్యక్ష బాధ్యతలు ఇవ్వడంలోనే కాంగ్రెస్ విజయం సాధించిందని హర్షం వ్యక్తం చేశారు. అన్ని రాజకీయ పార్టీలూ ఆలోచించాలని తెలిపారు. దళితులు ఏకమైతే వార్ వన్ సైడ్ అయిపోతుందని, ప్రజలు అధికారం కట్టబెట్టిన తర్వాత దళితుల అభివృద్ధిని మరిచిపోతే ఎన్నికల్లో కూడా రాజకీయ పార్టీలను పూర్తిగా మర్చిపోతారని తెలిపారు. రిజర్వేషన్‌లో భాగంగా దళితులకు ఎంత శాతం ఉంటే అంత శాతం రాజ్యాధికారంలో అవకాశం ఇచ్చిన పార్టీలను శాశ్వత ప్రజల అధికార పార్టీగా నిలుపుకుంటారని చెప్పారు. వివిధ గ్రామాల మాలలు పాల్గొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

దేవుడినీ వదలని చక్రపాణి రెడ్డి

- యువగళం సభలో నారా

పాదయాత్రలో బస్సులోని ప్రయాణీకులకు అభివాదం తెలుపుతున్న నారా లోకేష్

బుడ్డా రాజశేఖర్‌రెడ్డితో అభివాదం తెలుపుతున్న నారా లోకేష్

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి/ఆత్మకూరు

శ్రీశైలం ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి దేవుడిని కూడా వదలడం లేదని, అందుకే ఆయన చీటింగ్ చక్రపాణి అని టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ పేర్కొన్నారు. ఆయన చేపట్టిన యువగళం పాదయాత్ర శనివారం ఆత్మకూరు మండలంలో సాగింది. కే.స్టార్ హెూటల్ నుండి ప్రారంభమైన పాదయాత్ర కరివేన, ఆత్మకూరు, బాపనంతాపురం మీదుగా నల్లకాల్వ వరకు సాగింది. ఆత్మకూరు పట్టణం జనంతో కిక్కిరిసిపోయింది. యువగళం పాదయాత్రలో లోకేష్ ను చూసేందుకు భారీగా రోడ్లపైకి మహిళలు, యువత, వృద్దులు భారీగా వచ్చారు. లోకేష్ అందరినీ ఆప్యాయంగా పలకరించి వారి సమస్యలు తెలుసుకున్నారు. ఆత్మకూరులో ఉన్న చిరు వ్యాపారస్తులతో లోకేష్ మాట్లాడారు. వారు పడుతున్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. ఆత్మకూరు శివారులో ఏర్పాటు చేసిన బహిరంగ సభలో లోకేష్ మాట్లాడుతూ ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి వర్ధన్ బ్యాంక్ ఏర్పాటు చేసి, మూడు నెలల్లో బోర్డు తిప్పేసి వంద కోట్లు మోసం చేశారన్నారు. తాము అధికారంలోకి రాగానే ఆ మొత్తాన్ని కక్కించి డిపాజిటర్లకు తిరిగి చెల్లించేలా చూస్తామని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యేకు 10 శాతం కట్టకుండా ఏ పనీ జరగడం లేదన్నారు. శ్రీశైలం బోర్డులో ఉద్యోగాలు తమ ఔట్ సోర్సింగ్ ఏజన్సీ ద్వారా మాత్రమే చేస్తున్నారన్నారు. గుండాల వాగును ఎమ్మెల్యే అనుచరులు కబ్జా చేసి ప్లాట్లు వేసి అమ్మేశారన్నారు. అనంతరం పాదయాత్ర ఆత్మకూరు పట్టణం గుండా సాగింది. అడుగడుగునా జనం ఘన స్వాగతం పలికారు. కరివేన గ్రామస్తులు యువనేత లోకేష్ ను కలిసి తాము ఎదు ర్కొంటున్న సమస్యలపై వినతిపత్రం సమర్పించారు. తాగునీరులేక ఇబ్బంది పడుతున్నామని, తాగునీటి సౌకర్యం కల్పించాలని, డ్రైనేజిలు, సిసి రోడ్లు లేవని తెలిపారు. పాదయాత్రలో మాజీ మంత్రులు భూమా అఖిల ప్రియ, ఎన్ ఎం డి ఫరూక్, ఎమ్మెల్సీ రాంగోపాల్ రెడ్డి, టీడీపీ జిల్లా అధ్యక్షులు గౌరు వెంకటరెడ్డి, శ్రీశైలం నియోజకవర్గ ఇంచార్జీ బుడ్డా రాజశేఖర్ రెడ్డి, జిల్లా టీడీపీ మహిళా విభాగం అధ్యక్షురాలు పార్వతమ్మ, నియోజకవర్గ ఇన్చార్జిలు బిసి.జనార్ధన్ రెడ్డి, మాంద్ర శివానందరెడ్డి, ధర్మవరం సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

లోకేష్‌ను కలిసిన న్యాయవాదులు

ఆత్మకూరు కోర్టు రోడ్డులో న్యాయవాదులు యువనేత లోకేష్ ను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఆత్మకూరులో అదనపు జూనియర్ సివిల్ జడ్జి కోర్టును ఏర్పాటు చేయాలని, కోర్టు నిర్మించి 35ఏళ్లు అయినందున బిల్డింగు శిథిలావస్తకు చేరుకుందని, కొత్త భవనం నిర్మించాలని కోరారు. న్యాయవాదులపై సంఘ విద్రోహ శక్తులు దాడులను అరికట్టాలని, ఆత్మకూరు న్యాయవాదులకు ఇళ్లస్థలాలు, ఇళ్లనిర్మాణానికి నిధులు కేటాయించాలని కోరారు. ఆత్మకూరు గౌడ్ సెంటర్ సమీపంలో వ్యాపారులు యువనేత లోకేష్‌ను కలిసి సమస్యలను విన్నవించారు. నాటుసారా తయారీ సాకుతో బెల్లం విక్రయాలపై పోలీసులు దాడులు చేస్తుండటంతో, మంచి బెల్లం దొరక్క ప్రజలు అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. పెనుభారంగా మారిన జీఎస్టీని రద్దు చేయాలని కోరారు. ఆర్యవైశ్య కార్పొరేషన్ కు నిధులు కేటాయించాలని, నంద్యాల జిల్లాను ఐటీ రంగంలో అభివృద్ధి చేయాలని కోరారు. డ్వాక్రా మహిళలు లోకేష్ ను కలిసి తమ సమస్యలను విన్నవించారు.

ప్రేమకు నిలువెత్తు.. 'అమ్మ'

- నేడు మదర్స్ డే

ప్రజాశక్తి - మహానంది

కొందరి ప్రేమ స్వలాభం కోసం.. మరికొందరి ప్రేమ కొంతకాలం.. ఇంకొందరి ప్రేమ తమ అవసరం ఉన్నంత వరకు.. కానీ అమ్మ ప్రేమ మాత్రం శాశ్వతంగా ఉంటుంది. తన గర్భంలో తొమ్మిది నెలలు కంటికి రెప్పలా కాపాడుకుంటూ తన బాధను భరించుకొని బిడ్డకు జన్మనిస్తుంది అమ్మ. జన్మనిచ్చినప్పటి నుండి పిల్లల గురించే ధ్యాస ఆమె ధ్యాస. బిడ్డల ఉన్నతి కోసం ఆలుపెరగకుండా శ్రమిస్తుంది తల్లి. అందుకే విశ్వంలో అమ్మకు అగ్రభాగం ఇవ్వాల్సిందే.

అమ్మంటే కమ్మని కావ్యం తీయటి రాగం. ఏ స్వార్థం లేకుండా, నిస్వార్థంగా పిల్లల ఎదుగుదలకు తోడ్పడుతోన్న మాతృమూర్తుల కోసం ప్రతీ యేడాది 'మదర్స్ డే' నిర్వహిస్తున్నారు. ఈ మదర్స్‌డే మే రెండో ఆదివారం రోజున జరుపుకొంటారు. ఇంతకీ సెకండ్ వీక్ సండే ఏందుకు.. అంటే.. 1914 నుంచి మదర్స్ డేను అధికారికంగా నిర్వహిస్తున్నారు. గ్రీస్‌లో రియా అనే దేవత ఉండేవారు. ఆమెను మదర్ ఆఫ్ గాడ్స్ అని పిలిచేవారు. 17వ శతాబ్దంలో బ్రిటన్‌లో తల్లులను గౌరవిస్తూ మదరింగ్ సండే పేరుతో ఉత్సవం నిర్వహించేవారు. 1872లో అమెరికాలో జూలియవర్డ్ హెూవే అనే మహిళ మదర్స్ డే నిర్వహించాలని పట్టు బట్టారు. మాతృమూర్తుల కోసం మదర్స్ డే జరపాలనే ఆలోచన పడింది అప్పుడే.. అన్న మేరీ అనే మహిళా మదర్స్ డే జరపాలని పోరాడారు. ఆమె బతికుండగా మాత్రం సాధ్యం కాలేదు. ఆమె కూతురు మిస్ జెర్విన్ ప్రయత్నంతో మదర్స్ డే వేడుక సక్సెస్ అయ్యింది. 1911 నుంచి అమెరికాలో క్రమంగా జరుపుకోవడం ప్రారంభించారు. 1914 నుంచి మదర్స్ డేను అధికారికంగా నిర్వహించడం ప్రారంభించారు. అప్పటి అమెరికా అధ్యక్షుడు ఉడ్రో విల్సన్ వేడుకకు అంకురార్పణ చేశారు. తర్వాత క్రమంగా ఇతర దేశాలు జరుపుకోవడం ప్రారంభించాయి. మన కోసం అన్నీ చేస్తోన్న వారికి ఒకరోజు కేటాయించడం గొప్ప కదా అనుకొని.. అన్నీ దేశాలు నిర్వహిస్తు న్నాయి. అలా మే రెండో ఆదివారం రోజున మాతృ దినోత్సవంగా జరుపు కొంటున్నారు. పిల్లల ఎదుగుదల కోసం అవిశ్రాం తంగా శ్రమిస్తోన్న తల్లులందరికీ ప్రజాశక్తి దినపత్రిక తరపున మదర్స్ డే శుభాకాంక్షలు.

అవయవాలు పని చేయకున్నా.. అమ్మప్రేమ శాశ్వతం

మహానంది గ్రామంలో 17 ఏళ్ల వయస్సు ఉన్న లక్కిరెడ్డి సాయికుమార్ రెడ్డి అనే అబ్బాయి పుట్టుకతోనే శరీరంలో ముఖ్యమైన అవయవాలు ఏవి పనిచేయకుండా జన్మించాడు. ఈ అబ్బాయి తండ్రి చంద్రశేఖర్ రెడ్డి, తల్లి భారతిలు అధైర్య పడకుండా దాతల సాయం కూడా తీసుకోకుండా అబ్బాయిని పెంచి పోషిస్తున్నారు. వీరికి ఉన్న కుటుంబ ఆర్థిక సమస్యలు ఎన్ని ఉన్నా.. గుండె నిబ్బరంతో తండ్రి హోటల్లో పనిచేస్తూ.. తల్లి బాబు ఆలనా పాలన చూస్తూ జీవనం సాగిస్తున్నారు. ఈ దంపతులకు సాయికుమార్‌తో పాటు పాప, బాబు ఉన్నారు. ఈ తల్లిదండ్రులు సాయికుమార్‌తో పాటు మిగిలిన ఇద్దరినీ ప్రభుత్వ పాఠశాలలో విద్యాభ్యాసం చేయిస్తున్నారు. ఈ అబ్బాయి తల్లిదండ్రులకు కొంతమేర ప్రభుత్వం నుండి పింఛను రూపంలో ఆర్థిక సాయం అందుతున్నా.. వీరు జీవితంలో అధైర్య పడకుండా జీవనం సాగిస్తున్నా.. ఈ మాతృమూర్తి ప్రేమకు వందనాలు అంటూ చుట్టు పక్కల ఇళ్లవాళ్లు, పలువురు పేర్కొంటున్నారు.

'పది'లో చివరి స్థానం...

ప్రజాశక్తి - కర్నూలు ప్రతినిధి

రాష్ట్ర వ్యాప్తంగా విడుదలయిన పదో తరగతి పరీక్షా ఫలితాల్లో నంద్యాల జిల్లా చివరి స్థానంలో నిలిచింది. నంద్యాల జిల్లా మొత్తం 60.39 శాతం ఉత్తీర్ణత సాధించింది. జిల్లావ్యాప్తంగా 22,456 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 13,562 మంది పాసయ్యారు. అందులో బాలురు 6,669 మంది, బాలికలు 6,893 మంది ఉత్తీర్ణత సాధించారు. ఈ ఏడాది పదో తరగతి ఫలితాల్లో బాలికలదే పైచేయిగా నిలిచింది. 100 శాతం 14 స్కూల్స్,, 60 శాతం మూడు ప్రభుత్వ పాఠశాలలో ఉత్తీర్ణత సాధించాయి. నంద్యాల జిల్లాలో రెండు పాఠశాలలు సున్నా ఉత్తీర్ణత సాధించాయి.

కొనసాగుతున్న యువగళం

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర ఉమ్మడి కర్నూలు జిల్లాలో కొనసాగుతోంది. తొలుత డోన్ నియోజకవర్గంలోకి ప్రవేశించిన యాత్ర పత్తికొండ, ఆలూరు, ఆదోని, మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు, పాణ్యం, కర్నూలు, నందికొట్కూరు నియోజకవర్గాల్లో ముగిసింది. ప్రస్తుతం శ్రీశైలం నియోజకవర్గంలో సాగుతోంది. అడుగడుగునా పలు వర్గాలు, గ్రామస్తులు, పలు సంఘాల ప్రతినిధులు లోకేష్ ను కలిసి తమ సమస్యలను విన్నవిస్తున్నారు.

హైవే రోడ్డు బాధిత రైతుల ఆందోళన...

ఆరు లైన్ల రోడ్డు, హైవే రోడ్డు బాధిత రైతులతో కలిసి ఆర్ డిఓ, తహశీల్దార్, కలెక్టర్కు వినతిపత్రాలు అందజేశారు. ఆరు లైన్ల రోడ్డు కోసం, బైపాస్ హైవే రోడ్డు కోసం భూములు ఇస్తున్న రైతులకు న్యాయమైన నష్టపరిహారం ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఆరు లైన్ల రోడ్డు కోసం, హైవే రోడ్డు కోసం కర్నూలు, కల్లూరు మండలాల్లో 12 గ్రామాల రైతుల నుంచి 300 ఎకరాలు, బి. తాండ్రపాడు నుంచి గార్గేయపురం వరకు ప్రభుత్వం సేకరిస్తోందని తెలిపారు. దీనికోసం రైతులకు చాలా అన్యాయమైన పరిహారం ఇస్తున్నారని విమర్శించారు. దిన్నెదేవర పాడు, నందనపల్లె, గార్గేయపురం భూములు రూ.3 కోట్ల విలువ చేసే భూములని, అక్కడి రైతులకు రూ.30 లక్షలు, నందనపల్లి గ్రామ రైతులకు రూ.8 లక్షలు మాత్రమే నష్టపరిహారం ఇస్తున్నారని తెలిపారు.

కర్నూలులో ఉద్రిక్తత...

టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ చేపట్టిన పాదయాత్ర సందర్భంగా కర్నూలు నగరంలో ఉద్రిక్తత నెలకొంది. కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ భూములు కబ్జా చేసినట్లు ముస్లిం మైనారిటీలతో లోకేష్ ముఖాముఖి సందర్భంగా ఆరోపించారు. సోమవారం కర్నూలులోని ఎస్టి టిబిసి కళాశాల మైదానంలోని విడిది కేంద్రం నుంచి పాద యాత్ర ప్రారంభమైంది. పాదయాత్ర ప్రారంభానికి ముందే ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ విలేకరుల సమావేశం నిర్వహించారు. తనపై లోకేష్ చేసిన ఆరోపణలను నిరూపించాలని, ఎక్కడికి రావాలో చెప్పాలని, లేకుంటే తానే పాదయాత్ర వద్దకు వస్తానని సవాల్ చేశారు. లోకేష్ పాదయాత్ర కొనసాగుతుండగా నగర ంలోని లాల్ మసీదు వైపు నుంచి ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ నడుచుకుంటూ పూల బజార్ వైపు పాదయా త్రకు ఎదురు వెళ్లే ప్రయత్నం చేయగా ఉద్రిక్తత నెలకొంది. ఎమ్మెల్యే హఫీజ్ ఖాన్ ను పోలీసులు అరెస్ట్ చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

ఉపాధి హామీ పరిరక్షణకు ఉద్యమించాలి

- 15 జరిగే ధర్నాలో పాల్గొని విజయవంతం చేద్దాం
- వ్యకాసం, రైతు సంఘం, సిఐటియు

మాట్లాడుతున్న వ్యకాసం జిల్లా నాయకులు ఈశ్వరయ్య, సిఐటియు నాయకులు

కూలీలతో మాట్లాడుతున్న రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి రామచంద్రుడు

ప్రజాశక్తి - బేతంచెర్ల

ఉపాధి హామీ పరిరక్షణకై ఉపాధి కూలీలంతా ఐక్యంగా ఉద్యమించాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఆర్. ఈశ్వరయ్య, సిఐటియు జిల్లా నాయకులు వై.బి. వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. శనివారం స్థానిక మండలంలోని కొలుములుపల్లె, బలపాలపల్లె గ్రామాల ఉపాధి హామీ కూలీలు చేస్తున్న ట్రాగర్ ట్రెన్స్ కాలువ పనులను పరిశీలించి ఉపాధి హామీ కూలీల స్థితిగతులు తెలుసుకున్నారు. అనంతరం వారుఉపాధి హామీ కూలీలతో,మేటిలతో మాట్లాడారు. 15వ తేదీన జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు జరుగు ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరారు. కొలుములపల్లె,బలపాలపల్లె, గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్ ఎన్. నారాయణ, సంఘం మండల కమిటి సభ్యుడు నాగరాజు పాల్గొన్నారు. **ఆత్మకూర్:** ఉపాధి హామీ పరిరక్షణకై ఉపాధి కూలీలంతా ఐక్యంగా ఉద్యమించాలని ఏపి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు ఏ. రణధీర్, సిఐటియు జిల్లా నాయకులు డి. రామ్ నాయక్‌లు పేర్కొన్నారు. శనివారం మండలంలోని కృష్ణాపురం గ్రామంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వారు పరిశీలించి, కూలీల సమస్యలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేసేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర పన్నుతోందన్నారు. అందుకోసమే కేంద్ర బడ్జెట్లో 30 శాతం కోత విధించిందని, ఉపాధి హామీ కూలీల హాజరు ఆన్లైన్లో తీసుకోవాలని ఫోటో యాప్‌ను ప్రవేశపెట్టిందన్నారు. ఫోటో యాప్ విధానాన్ని రద్దుచేసి పాత పద్ధతి విధానాన్ని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పెండింగ్ బిల్లులు చెల్లించాలని, పనిచేసే చోట టెంట్ సౌకర్యం, మజ్జిగ మెడికల్ కిట్టు, పే స్లిప్పులు ఇవ్వాలని, ప్రతి కుటుంబానికి 200 రోజులు పనులు కల్పిస్తూ రూ.600 వేతనం ఇవ్వాలని, తదితర డిమాం డ్లపై ఈనెల 15వ తేదీన నంద్యాల కలెక్టర్ కార్యాలయం ముందు జరిగే ధర్నాలో ఉపాధి కూలీలంతా తరలివచ్చి జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో వ్యకాసం నాయకులు శంకరమ్మ, లక్ష్మీదేవి, ఫాతిమా, వెంకట లక్ష్మమ్మ, అంజనమ్మ, మల్లికార్జున, రమణయ్య, నాగయ్య, పెద్ద ముత్తు,తదితరు ఉపాధి కూలీలు పాల్గొన్నారు. **ఆళ్లగడ్డ:** ఉపాధి కూలీల హాజరు కోసం ఫోటో యాప్ పద్ధతిని రద్దుచేసి పాత పద్ధతిని కొనసాగించాలని రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి టి.రామచంద్రుడు డిమాండ్ చేశారు. శనివారం సిరివెళ్ల మండలంలోని బోయలకుంట్ల గ్రామంలో ఉపాధి కూలీలు పనిచేస్తున్న ప్రదేశానికి రైతు సంఘం నాయకులు వెళ్లి కూలీల సమస్యలను తెలుసుకున్నారు. రామచంద్రుడు మాట్లాడుతూ ఉపాధి కూలీలందరూ ఏకమై తమ హక్కుల కోసం పోరాడాలని పేర్కొన్నారు. 15న జిల్లా కలెక్టర్ ఆఫీస్ ముందు నిర్వహించే ఈ ధర్నాలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో భాస్కర్, యాకూబ్, పౌల్ తదితరులు పాల్గొన్నారు. **పాణ్యం:** కలెక్టర్ ఆఫీస్ ముట్టడి జయప్రదం చేయాలని సిఐటియు మండల కార్యదర్శి కె భాస్కర్, వ్యకాసం జిల్లా నాయకులు కృష్ణ, ఎస్ఎఫ్ఐ నాయకులు బత్తిని ప్రతాప్ పేర్కొన్నారు. మండల కేంద్రం పాణ్యంలో జరుగుతున్న ఉపాధి హామీ పనులను వారు పరిశీలి ంచి, కూలీల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేజే శ్రీనివాసరావు, మేటీలు సుధాకర్, సుబ్బయ్య, లక్ష్మమ్మ, వెంకటసుబ్బమ్మ పాల్గొన్నారు.

గుంతలు పడ్డిన రోడ్డు

దొర్నిపాడు పిహెచ్‌సికి వెళ్లాలంటే నరకం

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

ప్రజలకు 24 గంటలు వైద్య సేవలు అందించేందుకు ప్రతి మండల కేంద్రంలో ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ప్రభుత్వం ఏర్పాటు చేసింది.. అయితే దొర్నిపాడు మండల కేంద్రంలో ఈ దవాఖానకు రోగులు వైద్యం కోసం వెళ్లాలంటే దారి నరకంగా మారింది. మండల కేంద్రమైన దొర్నిపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రభుత్వ వైద్యశాలకు వెళ్లేందుకు వంకపై బ్రిడ్జిని ఏర్పాటు చేశారు. వంకపై అక్రమ కట్టడాలు కట్టడంతో నీళ్ల తాకిడికి గత కొన్ని రోజుల క్రితం బ్రిడ్జికి ఏర్పాటు చేసిన గోడతోపాటు బ్రిడ్జి పడిపోవడంతో వైద్యశాలకు రోగులు వెళ్లేందుకు ఇబ్బందిగా మారింది. ఇంతే కాకుండా అత్యవసర సేవల కొరకు మెరుగైన వైద్యం కోసం రోగులను తీసుకెళ్లడానికి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 108,104 వాహనాల రాకపోకలకు అంతరాయం ఏర్పడడంతో వాహనాలు వైద్యశాలలోనికి వెళ్లడానికి దారి సౌకర్యం లేక బయట పెట్టుకోవలసిన దుస్థితి ఏర్పడింది. దీంతో రోగులు చాలా ఇబ్బందులకు గురవుతున్నారు. ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని సంబంధిత అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు.

పెద్దగుంత పడ్డిన రోడ్డు

అర్హులందరికీ సంక్షేమ పథకాలు : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందుతున్నాయని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా అన్నారు. పట్టణంలోని 5 వార్డు నడిగడ్డలో కౌన్సిలర్ ఆరిఫ్ నాయక్ ఆధ్వర్యంలో శనివారం ఉదయం 103వ రోజు గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు ప్రతి ఇంటికి తిరిగి సంక్షేమ పథకాల కరపత్రాలను లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా మాట్లాడుతూ నంద్యాల నియోజకవర్గంలో వైయస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత సంక్షేమ అభివృద్ధికి పెద్దపీట వేస్తున్నామన్నారు. లబ్ధిదారిని ఇంటికి వచ్చి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఏకైక ప్రభుత్వం వైఎస్ఆర్ ప్రభుత్వం అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్ పర్సన్ మాబునిస, మున్సిపల్ వైస్ ఛైర్మన్ పామ్ షావలి, కౌన్సిలర్లు శాదిక్ బాష, సమ్మద్,తబ్రేజ్, మాజీ కౌన్సిలర్ అనిల్ అమృతరాజ్, వార్డు వైసిపి నాయకులు, ప్రభుత్వ అధికారులు సచివాల సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా

ప్రజలలో జగనన్న పాలనపై నమ్మకం ఉంది
- ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

మహానంది : వైసీపీ ప్రభుత్వంలో లబ్ధిదారులందరికీ సంక్షేమ పథకాలు అందుతాయనే నమ్మకం ప్రజల్లో ఉందని ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి అన్నారు. శనివారం మహానంది మండలం మేజర్ గ్రామపంచాయతీ సీతారామపురం గ్రామంలో 97వ రోజు గడప గడపకు మన ప్రభుత్వంలో ఎమ్మెల్యే పాల్గొన్నారు. ముందుగా మండల ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, సర్పంచ్ తేజస్విని రెడ్డి,వైసీపీ నాయకులు బుడ్డారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, ప్రభాకర్ రెడ్డి, భాస్కర్ రెడ్డి, మాజీ సర్పంచ్ బండి రమణయ్య, నాయకులు, కార్యకర్తలు,అభిమానులు ఎమ్మెల్యే శిల్పాకు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఇంటింటికి తిరిగి లబ్ధి పొందిన పథకాలను వివరించారు. అనంతరం నూతనంగా నిర్మించిన గ్రామ సచివాలయం, రైతు భరోసా కేంద్రం, విలేజ్ హెల్త్ క్లినిక్ భవనాలను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల ఎంపీపీ బుడ్డారెడ్డి యశస్విని, సర్పంచ్ తేజస్విని రెడ్డి, వైసీపీ నాయకుడు బుడ్డారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే శిల్పా చక్రపాణి రెడ్డి

కర్ణాటక గెలుపుతో కాంగ్రెస్ సంబరాలు

నంద్యాల : సంబరాలు చేసుకుంటున్న కాంగ్రెస్ నేతలు

ప్రజాశక్తి - నంద్యాల

నంద్యాల పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య ఆధ్వర్యంలో కర్ణాటక రాష్ట్ర శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ 224 స్థానాలకు గాను 136 సీట్లను సాధించి విజయ దుందుభి మోగించిన సందర్భంగ నంద్యాల కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో బాణసంచా కాల్చి స్వీట్లు పంపిణీ చేసి సంబరాలు చేసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు ఊరేగింపుగా వెళ్లి నూనెపల్లె సర్కిల్, శ్రీనివాస సెంటర్ మీదుగా గాంధీ చౌక్‌కు వెళ్లి పెద్ద ఎత్తున బాణసంచారాలను కాల్చి ప్రజలకు మిఠాయిలు పంచిపెట్టి విజయోత్సవ వేడుకలను చేసుకున్నారు. ఈ సందర్భంగా పిసిసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డాక్టర్ చింతల మోహన్ రావు మాట్లాడుతూ ఎన్నికల ముందు నరేంద్రమోడీ, అమిత్‌షాలు మతతత్వంతో ఓట్లు రాబట్టాలని, అధికారం చేపట్టాలని ఎన్ని కుట్రలు చేసినా ప్రజలు మాత్రం అభివృద్ధికే ఓటు వేశారన్నారు. ఇది మత రాజకీయాలకు వ్యతిరేకంగా ఇచ్చిన తీర్పు అన్నారు. రానున్న తెలంగాణ, మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, రాజస్థాన్ తదితర రాష్ట్రాలలో జరగబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధిస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రివర్యులు, మాజీ పిసిసి అధ్యక్షులు డాక్టర్ ఎన్ . రఘువీరారెడ్డి, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రథసారథి గిడుగు రుద్రరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ మస్తాన్ వల్లి సేవలను గుర్తించి కాంగ్రెస్ పార్టీ అధిష్టానం కర్ణాటక రాష్ట్ర ఎన్నికల్లో బెంగళూరు నగరం ఎన్నికల పరిశీలకులుగా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి పక్కనే ఉన్న కర్ణాటక ప్రాంతాలలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను గెలిపించుకునే బాధ్యతను అప్పగించారన్నారు. ఆంధ్రప్రదేశ్‌లోనూ కాంగ్రెస్ పార్టీ అధికారంలో ఉంటే మాత్రమే బడుగు, బలహీన వర్గాలకు అభివృద్ధి సంక్షేమం ఫలాలు అందుతాయని అన్నారు.కర్ణాటక రాష్ట్ర ప్రజలు ఎంతో విజ్ఞత కలిగిన వారని అభివృద్ధిని, సంక్షేమా న్ని ఇచ్చే కాంగ్రెస్ పార్టీని చూసి పెద్ద ఎత్తున ఓట్లు వేసి కర్ణాటక ప్రజలు కాంగ్రెస్ పార్టీని గెలిపించారన్నారు. పీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఉకొటు వాసు, పట్టణ అధ్యక్షులు దాసరి చింతలయ్య, ఎస్సీ సెల్ స్టేట్ కోఆర్డినేటర్ కరాటే బాలకష్ణ, సేవ దళ రాష్ట్ర కార్యదర్శి మస్తాన్ ఖాన్, బీసీ సెల్ నంద్యాల జిల్లా అధ్యక్షులు సంపంగి రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

ఆళ్లగడ్డ : కర్ణాటక రాష్ట్రంలో 136 అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ పార్టీ ఘన విజయం సాధించిందని, రానున్న సార్వత్రిక ఎన్నికల్లో రాష్ట్రంలోనూ కాంగ్రెస్ ఘనవిజయం సాధిస్తుందని నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ పుల్లయ్య ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటకలో అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించినందుకు కాంగ్రెస్ పార్టీ ఆళ్లగడ్డ నియోజకవర్గం ఇన్చార్జి పుల్లయ్య హర్షం వ్యక్తం చేశారు. మండల పరిధిలోని గోవింద పల్లె గ్రామ సమీపంలో ఉన్న సింధు వేర్ హౌస్ ఆవరణంలో శనివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, ఆయన మాట్లాడారు. కర్ణాటకలో ప్రజాస్వామ్యం విజయం సాధించిందన్నారు. 2024లో దేశంలో కాంగ్రెస్ విజయం సాధిస్తుందన్నారు.

పార్టీకి పూర్వ వైభవం

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ గెలుపుతో దేశంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం వస్తుందని కాంగ్రెస్ పార్టీ సీనియర్ మైనార్టీ నాయకులు హఫీజ్ శంసుల్ హక్ ధీమా వ్యక్తం చేశారు. కర్ణాటకలో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించడంతో పట్టణంలో ర్యాలీ నిర్వహించి నాలుగు రోడ్ల కూడలిలో ఒకరినొకరు ఆనందంతో స్వీట్లు తినిపించుకుని, పటాసులు పేల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటకలో బిజెపిని ఓడించిన ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రైతులకు రుణమాఫీ, రాష్ట్రానికి ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు పూర్తిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆళ్లగడ్డ మండల అధ్యక్షుడు హుస్సేన్ బాషా, వెంకటసుబ్బయ్య యాదవ్, నాగయ్య, బాష, మైకల్, కొండపల్లి జాఫర్, షేక్షావలి తదితరులు పాల్గొన్నారు.

లోకదాలత్‌లో సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు

లోక్ అదాలత్‌లో 72 కేసులు పరిష్కారం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలోని కోర్టు ఆవరణంలో శనివారం నాడు జరిగిన జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమంలో 72 కేసులు పరిష్కారం అయ్యాయి. ఈ కార్యక్రమాన్ని సీనియర్ సివిల్ జడ్జి వెంకటేశ్వరరావు, జూనియర్ సివిల్ జడ్జి ఇన్చార్జి ఎం పవన్ కుమార్ నిర్వహించారు. 63 క్రిమినల్, 3 సివిల్ కేసులు, 3 మెయింటెనెన్స్‌కు సంబంధించి, మూడు బ్యాంకు కేసులు పరిష్కారానికి నోచుకున్నాయి. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు మాణిక్యరావు, బలరాం నాయక్, తదితరులు పాల్గొన్నారు. **కోవెలకుంట్ల:** కోయిలకుంట్ల జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌లో 432 కేసులు పరిష్కరించినట్లు జడ్జి అబ్దుల్ రెహ్మాన్ తెలిపారు.

అధిక ప్రయాణీకులతో వెళ్తున్న ఆటోలు సీజ్

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

అధిక ప్రయాణీకులతో వెళ్తున్న 14 ఆటోలను సీజ్ చేసినట్లు కొలిమిగుండ్ల ఎస్ఐ రమేష్ రెడ్డి శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొలిమిగుండ్ల మండల పరిధిలో ఇతర గ్రామాలకు పనికి వలసలు వెళుతున్న అధిక ప్రయానికులతో వెళ్తున్న ఆటోలను సీజ్ చేసి కేసులు నమోదు చేస, వారిని బనగానపల్లె కోర్టు నందు హాజరు పరచగా, కోర్టు జరిమానా వేయడం జరిగిందన్నారు. రోడ్డు ప్రమాదాలా నివారణలో భాగంగా మైకు ద్వారా గ్రామాల్లో అవగాహన కల్పించారు.

బైక్ అదుపుతప్పి..

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని హరినగరం గ్రామ సమీపంలో మోటార్ సైకిల్ అదుపుతప్పికింద పడటంతో ఒకరికి గాయాలు అయ్యాయి. గ్రామస్తులు వివరాల మేరకు శనివారం గోస్పాడు మండలం తెల్లపురి గ్రామానికి చెందిన నరసింహుడు మోటార్ సైకిల్‌పై అహోబిలం వెళ్లి ఇంటికి తిరిగి వెళుతున్న సమయంలో ప్రమాదవశాత్తు మోటార్ సైకిల్ కింద పడటంతో అతనికి గాయాలు అయ్యాయి. చికిత్స నిమిత్తం రుద్రవరం 108 వాహనం ద్వారా ఆళ్లగడ్డ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు గ్రామస్తులు తెలిపారు.

ప్రముఖ హోమియో వైద్యులు పాల కొండయ్య మృతి

ప్రజాశక్తి - మహానంది

పాలకొండయ్య (ఫైల్)

మండలంలోని ఆర్ఎస్ గాజులపల్లె గ్రామానికి చెందిన ప్రముఖ హోమియో వైద్యులు పాలకొండయ్య అనారోగ్యంతో శనివారం రాత్రి మృతి చెందారు .ఈయన మహానందిలోని వివేకానంద గురుకుల పాఠశాలలో ఉపాధ్యాయుడిగా విద్యాదానం చేయడమే కాక, హోమియో వైద్యంతో మంచిపేరు తెచ్చుకున్నారు. ఈయన అకాల మృతి పట్ల మండలంలో పలువురు సంతాపం తెలిపారు.

ఫ్లైఓవర్ బ్రిడ్జిని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

సలీంనగర్ శ్యాంనగర్ నూతన బ్రిడ్జి ప్రారంభం

- పాల్గొన్న ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

నంద్యాల పట్టణంలోని 35 వార్డు సలీంనగర్లో రూ.90 లక్షలతో నిర్మించిన నూతన బ్రిడ్జిని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి, ఎమ్మెల్సీ ఇషాక్ బాషా, మున్సిపల్ చైర్ పర్సన్ మాబునిస, మున్సిపల్ కమిషనర్ రవిచంద్ర రెడ్డి, వార్డు కౌన్సిలర్ చింపింగ్ బాష ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి మాట్లాడుతూ సలీం నగర్ శ్యామ్ నగర్ నూతన బ్రిడ్జి ఈ ప్రాంత ప్రజలకు సౌకర్యవంతంగా ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఇక్కడ త్వరలో అర్బన్ హెల్త్ సెంటర్ ను ప్రారంభించడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పంషావలి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, వార్డు వైసిపి నాయకులు మాజీ కౌన్సిలర్ మహబూబ్ బి, పెద్ద మౌలాలి ,అత్త ఉల్లా, చింపింగు రెహమాన్, ఏకే ఖాన్, మున్సిపల్ కౌన్సిలర్ కోఆప్షన్ సభ్యులు మున్సిపల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్ఆర్‌హెచ్‌యు కాన్వకేషన్‌లో సప్తశైల సుమిత్ర

ప్రజాశక్తి-డోన్

డాక్టర్‌వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ (వైఎస్ఆం హెచ్‌యు) 5వ కాన్వకేషన్‌లో యూనివర్సిటీ బోర్డు మెంబర్ డోన్ మున్సిపల్ ఛైర్మన్ సప్తశైల రాజేష్ సతీమణి సప్తశైల సుమిత్ర హాజరయ్యారు. డాక్టర్ వైఎస్ఆర్ హార్టికల్చర్ యూనివర్సిటీ 5వ కాన్వకేషన్ ఈనెల 12న పశ్చిమ గోదావరి జిల్లా తాడెపల్లిగూడెం, వెంకటరమణగూడెంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎపి గవర్నర్ అబ్దుల్ నజీర్, నీటి అయోగ్ మెంబర్ డాక్టర్ రమేష్ చంద్, వైఎస్ఆర్ యూనివర్సిటీ విసి టి.జానకిరామన్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విసి విష్ణువర్ధన్‌రెడ్డి, డాక్టర్ వైఎస్ఆర్‌హెచ్‌యు బోర్డు సభ్యులు హాజరయ్యారు.

వివాహ ముహూర్తం వేడుకల్లో బిసి ఇందిర

ప్రజాశక్తి - కొలిమిండ్ల

మండలంలోని గొర్విమానుపల్లె గ్రామానికి చెందిన కృష్ణమూర్తి గారి కుమారుడి వివాహ ముహూర్తం కార్యక్రమంలో బనగానపల్లె మాజీ శాసనసభ్యులు బీసీ జనార్దన్ రెడ్డి సతీమణి బీసీ ఇందిరా రెడ్డి శనివారం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మూలే రామేశ్వర్ రెడ్డి, తెలుగు యువత మండల అధ్యక్షులు గొంగటి హుసేన్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు కార్డులు ఇవ్వాలి

- కౌలు రైతు, రైతు సంఘాలు డిమాండ్

ప్రజాశక్తి - బేతంచెర్ల

దేవుని మన్యం భూములను సాగు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న కౌలు రైతులకు ప్రభుత్వం కౌలు కార్డులను తక్షణమే ఇవ్వాలని ఎపి కౌలు సంఘం జిల్లా కార్యదర్శి పి. సుధాకర్, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి సుబ్బరాయుడులు డిమాండ్ చేశారు. బేతంచెర్ల మండలం ఆర్ఎస్ రంగాపురం గ్రామ పరిధిలో 600 ఎకరాలకు పైగా మద్దిలేటి స్వామి ఆలయ భూమి, పాలుట్ల రంగస్వామి ఆలయ భూమి, చెన్నకేశవ స్వామి ఆలయ భూములు కలవని వీటివల్ల కౌలు రైతులు ప్రభుత్వం వేయు వేలం పాట ద్వారా దాదాపు రూ.20 లక్షల నుండి 24 లక్షల వరకు వేలంపాడి ప్రభుత్వానికి ఆదాయం చేకూరుస్తూ భూములను సాగు చేసుకుంటున్నారని వారన్నారు. శనివారం శ్రీ మద్దిలేటి లక్ష్మీనరసింహస్వామి దేవాలయం పాలకమండలి కమిటీ చైర్మన్ బి సీతారామ చంద్రుడికి కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వి సుబ్బరాయుడుల ఆధ్వర్యంలో వినతి పత్రం సమర్పించారు. అనంతరం నాయకులు మాట్లాడుతూ పంటలను ప్రభుత్వాలు కొనుగోలు చేసి, గిట్టుబాటుధరలను కల్పించి రైతులను ఆదుకోవాలన్నారు. లేనియెడల పోరాటం చేస్తామని వారన్నారు. రవి, లింగమ్మ, రఘు,మధు, పరమేష్, సుబ్బయ్య తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం ఇస్తున్న కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి పి సుధాకర్, రైతు సంఘం జిల్లా ఉపాధ్యక్షులు వి సుబ్బారాయుడు

మోదీ, అమిత్ షాలు రాజీనామా చేయాలి

- ప్రజాస్వామ్య లౌకిక ఐక్యవేదిక

ప్రజాశక్తి - నంద్యాల

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్‌షాలు రాజీనామాలు చేయాలని ప్రజాస్వామ్య లౌకిక ఐక్యవేదిక కన్వీనర్, ఎస్.ఎం.డి అబుల్ లైస్ అన్నారు. శనివారం నంద్యాల లోని స్థానిక ఆవాజ్ కమిటీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. కర్ణాటక రాష్ట్రంలో జరిగిన శాసనసభ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఘనవిజయం సాధించినందుకు సంతోషాన్ని వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ రాహుల్ ప్రేమ సందేశం గెలిచిందని మోడీ విద్వేషం ఓడిపోయిందని అన్నారు. మతాల మధ్య కులాల మధ్య చిచ్చు పెట్టడానికి శతవిధాల ప్రయత్నం చేసిన మోడీ, అమిత్ షాలు దీనికి నైతిక బాధ్యత వహిస్తూ తమ పదవులకు రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో మహిళలకు రక్షణ లేదని అన్నారు. కర్ణాటక ప్రజలు బిజెపికి గునపాఠం చెప్పారని అన్నారు. ఈ కార్యక్రమంలో బిషప్ డాక్టర్ ఎల్ మరియా రాజ్ భాస్కర్, పాస్టర్ జానయ్య మన్నెం, క్రిస్టియన్ జేఏసీ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ అబ్దుల్ సమద్, జమాత్ ఎ ఇస్లామి నంద్యాల జిల్లా అధ్యక్షులు మస్తాన్వలి, ఆవాజ్ జిల్లా ప్రధాన కార్యదర్శి మౌలానా ఖలీల్, సంగమి జమీ అతే ఉలేమా రాష్ట్ర కన్వీనర్ బాబా ఫక్రుద్దీన్, ఇన్సాఫ్ పార్టీ రాష్ట్ర కన్వీనర్ ఎస్. బాబుల్లా, టౌన్ ఆవాజ్ ప్రెసిడెంట్ మస్తాన్ ఖాన్, తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న అబులైస్

నంద్యాల జిల్లా జట్టుకు ట్రోఫిని అందజేస్తున్న దృశ్యం

టెన్నిస్‌బాల్, క్రికెట్ విజేతగా నంద్యాల జిల్లా జట్టు

ప్రజాశక్తి - చాగలమర్రి

చాగలమర్రి పట్టణంలోని జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో జరిగిన 4వ జూనియర్స్ రాష్ట్ర స్థాయి టెన్నిస్ బాల్ క్రికెట్ పోటీలలో విజేతగా నంద్యాల జిల్లా జట్టు నిలిచింది. శనివారం నంద్యాల,కడప జిల్లా జట్ల మధ్య జరిగిన ఫైనల్స్‌లో మొదట బ్యాటింగ్ చేసిన నంద్యాల జిల్లా జట్టు 12 ఓవర్లలో 125 పరుగులు చేయగా కడప జిల్లా జట్టు 12 ఓవర్లలో 5 వికెట్లను కోల్పోయి 64 పరుగులు మాత్రమే చేయడంతో నంద్యాల జిల్లా జట్టు 62 పరుగులతో విజయం సాధించి ఛాంపియన్‌గా నిలిచింది. విజేతగా నిలిచిన నంద్యాల జిల్లా జట్టుకు, రన్నర్స్‌గా నిలిచిన కడప జిల్లా జట్టుకు ట్రోఫీలను చక్రం బీడి,రియల్ ఎస్టేట్ వ్యాపారవేత్త ముల్లా షబ్బీర్ అహమ్మద్, హెచ్‌ఎం కోటయ్య,విద్యా కమిటీ చైర్మన్ అబ్దుల్లా,దాతలు ఇంతియాజ్,ఇర్షాద్,శ్రీకాంత్‌లు ట్రోఫీలను, మెడల్స్‌ను,సర్టిపికెట్‌లను అందజేసారు. క్రీడాభివృద్ధికి ఎల్లవేళలా తమ వంతు సహాయ,సహకారాలు అందిస్తామని దాతలు తెలియజేశారు. అనంతరం హెచ్ఎంను,చైర్మన్‌ను దాతలను,జిల్లా కార్యదర్శులను, అంపైర్లను నంద్యాల జిల్లా టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మెమెంటోలను అందజేసి శాలువలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర టెన్నిస్ బాల్ క్రికెట్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రేవంత్, జిల్లా కార్యదర్శి కడ్డీ మహబూబ్ బాషా,నంద్యాల జిల్లా ఎస్‌పి పిఈటిల అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర,నేషనల్ ఏ గ్రేడ్ అంపైర్ జగన్నాధరావు, పిడిలు దాదాపీర్,షేక్షావలి,నరసింహ, శ్రీనివాసులరెడ్డి,ప్రసాద్,ప్రతాప్, తదితరులు పాల్గొన్నారు.

ఎవ్వరు అడ్డుకున్నా.. పేదలకు ఇళ్ల స్థలాలు ఆపలేరు

- ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎవ్వరు అడ్డుకున్నా.. పేదలకు ఇచ్చే ఇళ్ల స్థలాల పంపిణీ ఆగవని, రాష్ట్ర ప్రభుత్వం పేదల సొంతింటి కల నెరవేర్చేందుకు ప్రతిష్టాత్మకంగా అన్ని గ్రామాల్లో, పట్టణాల్లో జగనన్న కాలనీలను నిర్మించడం జరిగిందని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్ర కిషోర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం నాడు పంపిణీ చేయనున్న ఇళ్లస్థలాల ప్రాంతాలను ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, మున్సిపల్ చైర్ పర్సన్ మాబన్నీసా, మున్సిపల్ కమిషనర్ రవి చంద్రరెడ్డి, సంభందిత శాఖల అధికారులతో పరిశీలించారు. ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడారు. నంద్యాలలో పేదలకు పంపిణీ చేయవలసిన ఇళ్లస్థలాలపై టిడిపి నాయకులు కోర్టులలో కేసులు వేశారని, కేసులను సమర్థవంతంగా ఎదుర్కొని గెలిచామన్నారు. నంద్యాల పట్టణంలో పేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు తాము చేస్తున్న శ్రమ, కృషి ఫలించిం దన్నారు. రానున్న వారం 10 రోజుల లోపల నంద్యాలలో పేదలకు అందించాల్సిన స్థలాలను స్థానిక మున్సిపల్ కార్యాలయంలో మీడియా సమక్షంలో డిప్ విధానం ద్వారా అందరికీ పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ పామ్ షావలి, మార్కెట్ యార్డ్ చైర్మన్ మహేశ్వర్ రెడ్డి, దృశ్య కళల డైరెక్టర్ సునీత అమృతరాజ్, కౌన్సిలర్లు ఆరిఫ్ నాయక్, వైఎస్ఆర్ సీపీ నాయకులు సాయిరాం రెడ్డి, అనీల్ అమృతరాజ్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ అంకిరెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల స్థలాలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే

వైద్య సేవలపై గిరిజనులకు అవగాహన

ప్రజాశక్తి - ఆత్మకూర్

మండల పరిధిలోని బైర్లూటి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో శనివారం నాడు బైర్లూటి గూడెం నందు సర్పంచ్ గురువమ్మ ఆధ్వర్యంలో గిరిజనులకు వైద్య సేవలపై వైద్యాధికారి డాక్టర్ పవన్ కుమార్ అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత కాలంలో జరిగే శుభ కార్యాలలో తప్పనిసరిగా నాణ్యమైన పదార్థాలను మాత్రమే ఉపయోగించి వంటలు చేసుకోవాలి అని, పరిశుభ్రత ను పాటించాలని, వేడి వేడి పదార్థాలను మాత్రమే భుజించాలి, పరిశుభ్రమైన నీటినే వినియోగించాలి అని చెప్పారు. భోజనానికీ ముందు, మరుగు దొడ్డి కి తర్వాత తప్పక చేతులు సబ్బుతో కడుక్కోవాలి అని, ఏదైనా వాంతులు మరియు విరేచనాలు అయిన వెంటనే ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని చెప్పారు. ప్రస్తుతం ప్రభుత్వ ఆసుపత్రుల యందు నాణ్యమైన వైద్యం అందుతుందని, 24 గంటలు సిబ్బంది అందుబాటులో ఉంటున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో స్టాఫ్ నర్స్ తులసి, సర్పంచ్ గురువమ్మ, గిరిజనులు పాల్గొన్నారు.

టిడిపి నేత మృతి

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

మండలంలోని రేవనూరు గ్రామానికి చెందిన టిడిపి నాయకులు రామిరెడ్డి శివరామిరెడ్డి (56) అనారోగ్యంతో మరణించాడు. శనివారం ఆయన మృతదేహానికి బనగానపల్లె మాజీ ఎమ్మెల్యే బీసీ జనార్దన్ రెడ్డి సోదరుడు బిసి రామనాథరెడ్డి పూలదండ వేసి నివాళులర్పించి, వారి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులను సన్మానిస్తున్న పూర్వపు విద్యార్థులు

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

ప్రజాశక్తి - ఆత్మకూర్

ఆత్మకూరు పట్టణంలోని పద్మావతి హైస్కూల్ నందు 1995–96 టెన్త్ పూర్వపు విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం శనివారం జరిగింది. ఈ సందర్భంగా పాఠశాలలో అప్పటి ఉపాధ్యాయులు రామారావు, సూర్యనా రాయణ, గాలిబ్ కృష్ణయ్యలను ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా పద్మావతి హైస్కూల్ డైరెక్టర్ ఎన్నో ఉన్నత పదవులు పొందడానికి కారణమైన విద్యను బోధించిన వారిని గుర్తించుకొని వారి సన్మానించడం కోసం ప్రత్యేక కార్యక్రమాన్ని ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమని ఆమె అన్నారు.

ఘనంగా కెఆర్ కృష్ణయ్య శెట్టి జయంతి

ప్రజాశక్తి-డోన్

డోన్ పట్టణంలోని శనివారం మాకం వీధిలోని వాసవి కాంప్లెక్స్ నందు ఘనంగా కేఆర్ కృష్ణయ్య శెట్టి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించినట్లు డోన్ ఆవోపా సంఘం సెక్రటరీ జొన్నలగడ్డ శ్రీనివాసులు శెట్టి తెలిపారు. శనివారం వాసవి కాంప్లెక్స్ నందు ఆవోపా సంఘం సభ్యులు కె ఆర్ కృష్ణయ్య శెట్టి 125వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల లు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా డోన్ ఆవోపా సంఘం సెక్రటరీ జొన్నలగడ్డ శ్రీనివాసులు శెట్టి మాట్లా డుతూ ఆవోపా సంఘానికి కేఆర్ కృష్ణయ్య శెట్టి చేసిన సేవలు అమోఘమని కొనియాడారు. కె ఆర్ కష్ణయ్య శెట్టి స్థాపించిన సేవలను రాష్ట్రవ్యాప్తంగా విద్య,వైద్యం,వితంతు పెన్షన్లు,పలు రకాల సేవలను ముందుకు తీసుకెళ్తున్నామన్నారు. ఆయన చేసిన సేవలను ఇప్పుడు ఉన్న సంఘం సభ్యులు గుర్తుచేసుకొని ఆయన అడుగుజాడల్లో నడవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆవోపా సంఘం అధ్యక్షులు మాకం కృష్ణ కిషోర్,కోశాధికారి శేగు సుదర్శన్ రావు,కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

కృష్ణయ్య చిత్రపటానికి నివాళులర్పిస్తున్న ఆవోపా సంఘం

వీరబ్రహ్మేంద్రస్వామి విగ్రహ ప్రతిష్ట

ప్రజాశక్తి - రుద్రవరం

మండలంలోని ముత్తలూరు గ్రామంలో జగద్గురు వీరబ్రహ్మేంద్ర స్వాముల దేవాలయం మాత గోవింద మాంబ సమేత జగద్గురు శ్రీ వీరబ్రహ్మేంద్ర స్వాముల దేవాలయ ప్రతిష్ట వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికిముఖ్య అతిథులుగా వీరబ్రహ్మేంద్రస్వామి 8వ తరం వారసులైన వెంకటాద్రి స్వామి, బ్రహ్మంగారి మఠం పిఠాధిపతులైన వీర శివకుమార్ స్వామి హాజరై వారిచేతుల మీదుగా గుడి ప్రతిష్ట కార్యక్రమం భక్తిశ్రద్ధలతో జరిపించారు.

ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే గంగుల బిజేంద్రారెడ్డి, ఆళ్లగడ్డ మార్కెట్ యార్డ్ చైర్మన్ గంధం వీరా రాఘవరెడ్డి పాల్గొన్నారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

15న కార్మిక సమస్యలపై చలో కలెక్టరేట్

ప్రజాశక్తి - బనగానపల్లె

ఈనెల 15న భవననిర్మాణ కార్మిక సమస్యలపై నిర్వహించనున్న చలో కలెక్టరేట్‌ను జయప్రదం చేయాలని నంద్యాల జిల్లా ఏఐటీయూసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ బాలకృష్ణ తెలిపారు. శనివారం పట్టణంలోని ఏఐటీ యూసీ కార్యాలయంలో భవన నిర్మాణ కార్మికుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం సక్రమంగా అమలు చేయకపోవడం వల్ల భవన నిర్మాణ కార్మికులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. 2019నుండి 32వేల మంది భవన నిర్మాణ కార్మికులు పరిహారం కోసం దరఖాస్తు చేస్తున్నప్పటికీ ఇంతవరకు ఏ ఒక్కరికి కూడా పరిహారం అందజేయలేదు అన్నారు. 50 సంవత్సరాల వయసు గల భవన నిర్మాణ కార్మికులకు నెలకు సామాజిక పెన్షన్ రూ.6వేలు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఇసుక పాలసీ విధానాన్ని పాతబద్ధతిలోని కొనసాగిం చాలని వారన్నారు. ఇసుక ధరలు తగ్గించి ప్రజలను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఏఐటియుసి నాయకులు బాలహుసేని,వెంకటేశ్వర్లు, శివ తదితరులు పాల్గొన్నారు.

నీతి కథలపై విద్యార్థులకు అవగాహన

ప్రజాశక్తి - కోవెలకుంట్ల

పట్టణంలోని శాఖ గ్రంథాలయం నందు విద్యార్థులకు సమ్మర్ క్యాంప్ లో భాగంగా శనివారం గ్రంథాలయ అధికారి రాఘవరెడ్డి ఆధ్వర్యంలో విద్యార్థులకు నీతి కథలపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారి విద్యార్థులకు మిత్ర లాభం, మిత్ర బేదము చదివించి మరల వారితో చెప్పించారు. విద్యార్థులకు అవసరమైన పోటి పరీక్షల కు అవసరయిన పుస్తకాలు ఉన్నాయని విద్యార్థులు ఉపయోగి ంచుకోవాలన్నారు. వివిధ పాఠశాల విద్యార్థులు పాల్గొన్నారు.

నిరసన తెలుపుతున్న 104 సిబ్బంది

104 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలి

ప్రజాశక్తి - బేతంచెర్ల

104 సిబ్బందికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీ 104, ఎంఎంయు ఎంప్లాయిస్ యూనియన్ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎన్ సురేష్ కుమార్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం బేతంచెర్ల మండలంలోని ఆర్ కొత్తపల్లి బుక్కాపురం గ్రామ సచివాలయం దగ్గర 104 సిబ్బంది నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ 104లో పనిచేసే సిబ్బందిని ప్రభుత్వమే నేరుగా విధులు నిర్వహించే విధంగా చేపట్టాలని వారి కోరారు. జీవో నెంబర్ 4459 ప్రకారము పిఎఫ్, ఈఎస్ఐ సక్రమంగా అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు. 104 ఎంఎంయు వాహన సేవలను గతంలో మాదిరిగానే ప్రభుత్వమే నిర్వహించాలని వారు కోరారు. 104 ఎంఎంయూ ఉద్యోగులను కాంట్రాక్ట్ ఆప్కాస్‌లో అబ్జర్వ్ చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం తక్షణం చర్యలు చేపట్టాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో డేటా ఎంట్రీ ఎన్ సురేష్, డ్రైవర్ పైలట్ వడ్డే అనుమ్ ప్రసాద్ పాల్గొన్నారు.

ప్రమాణ స్వీకారం చేస్తున్న వంకధార స్వర్ణలత

ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలుగా వంకధార స్వర్ణలత

ప్రజాశక్తి - బనగానపల్లె

ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలుగా వంకదార స్వర్ణలత ప్రమాణ స్వీకారం చేశారు. పట్టణంలోని శ్రీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి శాలలో పట్టణ ఆర్యవైశ్య మహిళ మండలి అధ్యక్షురాలిగా వంకధార స్వర్ణల త, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు. ఈ సందర్భంగా జరిగిన సమావేశంలో వంకధార స్వర్ణలత మాట్లాడుతూ ఆర్యవైశ్య సంఘం అభివృ ద్ధికి తన వంతు కృషి చేస్తానన్నారు. తనపై నమ్మకంతో ఆర్యవైశ్య మహిళా మండలి అధ్యక్షురాలుగా పదవి ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలిపారు. సంఘం ఆశయ సాధనకు, ఆర్యవైశ్య జాతి కీర్తి ప్రతిష్ఠలు పెంపొందించేం దుకు కృషి చేస్తానన్నారు. సంఘం భాధ్యతలకు కట్టుబడి, కర్తవ్య నిర్వహణలో సంఘం నియమ నిబంధనలకు అనుగుణంగా పనిచేస్తా నన్నారు. సంఘం అభివృద్ధికి అన్ని విధాల కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గాదంశెట్టి వేణుగోపాల్, నాయకులు శ్రీరామ సుబ్రహ్మణ్యం, డాక్టర్ రవి కుమార్, బింగిమళ్ళ హనుమాన్ శెట్టి, తదితరులు పాల్గొన్నారు.

ఆర్‌బికెల్లో అర్హుల జాబితా

ప్రజాశక్తి - కొలిమిగుండ్ల

మండలంలోని అన్ని రైతు భరోసా కేంద్రాల్లో 2023–24 సంవత్సరానికి సంబంధించిన రైతు భరోసా జాబితాను సిద్ధం చేసి రైతు భరోసా కేంద్రంలో అతికించినట్లు మండల వ్యవసాయ అధికారి పవన్ కుమార్ శనివారం తెలిపారు. రైతు భరోసా డబ్బులు కోసము రైతు భరోసా పోర్టల్‌లో ఈ నెల 15నుండి 18వ తేది వరకు అర్హతఉండి జాబితాలో పేర్లు లేని రైతులు మరల గ్రీవెన్స్‌లో నమోదు చేసుకోవాలని ఆయన కోరారు. మరింత సమాచారం కోసము రైతు భరోసా కేంద్రంలో సంప్రదించాలని ఆయన రైతులను కోరారు. వ్యవసాయ సిబ్బంది,రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

వెలుగోడులో నేడు యువగళం పాదయాత్ర

ప్రజాశక్తి - వెలుగోడు

వెలుగోడు పట్టణంలో ఆదివారం నారా లోకేష్ యువగళం పాదయాత్ర కొనసాగు తుందని తెలుగుదేశం పార్టీ శ్రీశైలం నియోజకవర్గం మైనార్టీ సెల్ అధ్యక్షులు మోమిన్ రసూల్ తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ శ్రీశైలం మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో ప్రస్తుతం నారా లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్రకు ఆయా ప్రాంతాలలోని ప్రజలు తమ గళాన్ని వినిపిస్తున్నారని తెలిపారు. నేడు జరుగుతున్న యువగళం పాదయాత్రకు ప్రజలు విజయవంతం చేయాలని వారు కోరారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి - చాగలమర్రి

పర్యావరణ పరిరక్షణ ప్రతి అందరి బాధ్యత అని డి.వనిపెంట ఫారెస్ట్ సెక్షన్ అధికారి కిషోర్ కుమార్ అన్నారు. శనివారం డీఎఫ్ఓ వినీత్ కుమార్, రుద్రవరం రేంజ్ అధికారి శ్రీపతి నాయుడు ఆదేశాల మేరకు మండలంలోని డి వనిపెంట చెంచుగూడెంలో పర్యావరణంపై చెంచులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు ప్లాస్టిక్ వినియోగించం అంటూ చెంచులచే ప్రమాణం చేయించారు. ఈ కార్యక్రమంలో ఎఫ్‌బీఓలు మదన్ గోపాల్,సుభాష్,ప్రొటెక్షన్ వాచర్లు పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అటవి శాఖ సిబ్బంది